بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadr.in

సంపుటి: 11 సంచిక : 3

వార్షిక చందా 600/-రూ॥

15 జనవరి 2026 క్రీ, శ. 15 సులహ్ 1405 హి, శ.

25 రజబ్ 1447 హి,ఖ.


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## ఖుర్ఆన్ బోధనలు

وَاعۡبُدُوا اللّٰہَ وَلَا تُشۡرِکُوۡا بِہٖ شَیۡـًٔا وَّبِالۡوَالِدَیۡنِ اِحۡسَانًا وَّ بِذِی الۡقُرۡبٰی وَالۡیَتٰمٰی وَالۡمَسٰکِیۡنِ وَالۡجَارِ ذِی الۡقُرۡبٰی وَالۡجَارِ الۡجُنُبِ وَالصَّاحِبِ بِالۡجَنۡۢبِ وَابۡنِ السَّبِیۡلِ ۙ وَمَا مَلَکَتۡ اَیۡمَانُکُمۡ ؕ اِنَّ اللّٰہَ لَا یُحِبُّ مَنۡ کَانَ مُخۡتَالًا فَخُوۡرَا ﴿ۙ۳۷﴾

**అనువాదం:** అల్లాహ్‌ను ఆరాధింపుడు. అతనితో ఏదానిని చేర్చకుడు. తల్లి దండ్రులపట్లను, బంధుమిత్రుల పట్లను, అనాధలపట్లను, పేదల పట్లను, బంధు వులైన పొరుగు వారి పట్లను, బంధువులు కాని పొరుగు వారి పట్లను, మీ మిత్రుల పట్ల ను, బాటసారుల పట్లను, మీ ఆధీనము లో ఉన్న వారి పట్లను మిక్కిలి దయతో ప్రవర్తింపుడు. నిశ్చయముగా అల్లాహ్ గర్వితుని,దాంభికున్ని ప్రేమించదు. **(అన్నిసా: 37)**

# సమస్త మానవజాతి అల్లాహ్ తాలా కుటుంబమే.

عَنۡ أَبِي هُرَيۡرَةَ، قَالَ: قَالَ رَسُولُ اللهِ صَلَّى اللهُ عَلَيۡهِ وَسَلَّمَ: ’’إِنَّ اللهَ عَزَّ وَجَلَّ يَقُولُ يَوۡمَ الۡقِيَامَةِ: يَا ابۡنَ آدَمَ، مَرِضۡتُ فَلَمۡ تَعُدۡنِي، قَالَ يَا رَبِّ: كَيۡفَ أَعُودُكَ وَأَنۡتَ رَبُّ الۡعَالَمِينَ؟ قَالَ: أَمَا عَلِمۡتَ أَنَّ عَبۡدِي فُلَانًا مَرِضَ فَلَمۡ تَعُدۡهُ؟ أَمَا عَلِمۡتَ أَنَّكَ لَوۡ عُدۡتَهُ لَوَجَدۡتَنِي عِنۡدَهُ؟ يَا ابۡنَ آدَمَ، اسۡتَطۡعَمۡتُكَ فَلَمۡ تُطۡعِمۡنِي، قَالَ يَا رَبِّ: وَكَيۡفَ أُطۡعِمُكَ وَأَنۡتَ رَبُّ الۡعَالَمِينَ؟ قَالَ: أَمَا عَلِمۡتَ أَنَّهُ اسۡتَطۡعَمَكَ عَبۡدِي فُلَانٌ؟ فَلَمۡ تُطۡعِمۡهُ، أَمَا عَلِمۡتَ أَنَّكَ لَوۡ أَطۡعَمۡتَهُ لَوَجَدۡتَ ذَلِكَ عِنۡدِي؟ يَا ابۡنَ آدَمَ، اسۡتَسۡقَيۡتُكَ فَلَمۡ تَسۡقِنِي، قَالَ يَا رَبِّ: كَيۡفَ أَسۡقِيكَ وَأَنۡتَ رَبُّ الۡعَالَمِينَ؟ قَالَ: اسۡتَسۡقَاكَ عَبۡدِي فُلَانٌ، فَلَمۡ تَسۡقِهِ، أَمَا إِنَّكَ لَوۡ سَقَيۡتَهُ وَجَدۡتَ ذَلِكَ عِنۡدِي‘‘

**(ముస్లిం కితాబుల్ బిర్రు వస్సల్వాత్, బాబ్ ఫజీలు ఇయాదతు మ్మరీజ్ )**

హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. వైభవంతుడైన అల్లాహ్ ప్రళయదినమున ఇలా ప్రశ్నించును. ఓ ఆదమ్ సంతానామా! నేను అనారోగ్యముగా ఉన్నప్పుడు మీరు నన్ను పరామర్శించలేదు?. అందుకు దాసుడు “ ఓ నా సంరక్షకుడా! నేను నిన్ను ఎలా పరామర్శించగలను, నిజానికి నీవే భూమండలపు ప్రాణులన్నింటిని సంరక్షించువాడవు ” అని సమాధానం ఇచ్చును. అప్పుడు అల్లాహ్! ‘‘ ఫలాన నా దాసుడు అనారోగ్యముగా ఉన్నాడనే విషయం నీకు తెలియదా?. నీవు అతనిని ఎందుకు పరామర్శించలేదు?. ఒకవేళ నీవు అతనిని పరామర్శించినచో నేను అక్కడ ఉంటాననే విషయం నీకు తెలియదా?” అని ప్రశ్నించును. (మరల ఇలా ప్రశ్నించును.) ఓ ఆదమ్ సంతానామా! నేను నిన్ను అహారంను అడిగాను, కాని నీవు నాకు అహారమును ఇవ్వలేదు అని ప్రశ్నించును. అందుకు ఆదమ్ సంతానము “ ఓ మా సంరక్షకుడా! మేము నీకు ఎలా అహారమును వడ్డించగలము? నిజానికి నీవే సకల లోకాలకు సంరక్షకుడవు కదా! ” అని సమాధానం ఇచ్చును. అప్పుడు అల్లాహ్ ! “ నీకు గుర్తుకు లేదా? ఫలాన నా దాసుడు నిన్ను అహారం అడిగాడు. కాని నీవు అతనికి అహారంను ఇవ్వలేదు. ఒకవేళ నీవు అతనికి అహారమును ఇచ్చినచో అందుకు ప్రతిఫలంను నీవు నా వద్ద పొందేవాడివి కదా! ” అని గుర్తు చేయును. (మరల ఇలా ప్రశ్నించును.) ఓ ఆదమ్ సంతానమా! “ నేను నిన్ను త్రాగటానికి మంచి నీటిని అడిగాను కాని, నీవు నాకు మంచినీటిని ఇవ్వలేదు ” అని ప్రశ్నించును. అందుకు ఆదమ్ సంతానము ! “ ఓ మా సంరక్షకుడా! నేను నీకు ఎలా మంచినీటిని త్రాగించగలను? నిజానికి నీవే సకల లోకాల సంరక్షకుడివి కదా! ” అని సమాధానం ఇచ్చును. అప్పుడు అల్లాహ్ ! “ ఫలాన నా దాసుడు నిన్ను మంచి నీళ్ళు అడిగాడు. కాని నీవు అతనికి మంచి నీళ్ళు ఇవ్వలేదు. ఒకవేళ నీవు అతనికి మంచి నీళ్ళు ఇచ్చినచో దాని ప్రతిఫలంను నీవు నా వద్ద పొందేవాడివి కదా!” అని తెలియజేయును. ■ ■ ■

# మానవజాతి పట్ల సానుభూతిని చూపవలెను. అతడు హైందవుడా లేక క్రైస్తవుడా అని ఆలోచించకుము.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: “దేవుని రెండు (ప్రత్యేక)ఆజ్ఞలున్నాయని తప్పక గుర్తుంచుకోండి. ఒకటి అతనికి మరెవ్వరిని కూడ సాటి కల్పించకూడదు. అతనికి ఉనికిపరంగా, సుగుణాల పరంగా, ఆరాధనల పరంగా. రెండవది మానవజాతి పట్ల సానుభూతిని చూపవలెను. మీ సోదరులు, బంధువులపై చూపునదే ఉపకారమనబడదు. నిజానికి (ఉపకారం) అందరిపై చూపాలి. అది ఆదామ్ సంతానమునకు చెందినవారిలో ఎవరైన మరియు సృష్టి ప్రాణులలో ఏదైన కాని. అతడు హైందవుడా లేక క్రైస్తవుడా అని ఆలోచించకుము. అల్లాహ్ తాలా మీ న్యాయబద్ధతను తన ఆధీనంలోకి తీసుకున్నాడని నేను మీకు నిజాన్ని తెల్పుచున్నాను. మీకు మీరే న్యాయం చేసుకోవడాన్ని అతడు ఇష్టపడడం లేదు. అందుకే మీరు ఎంతటి సున్నితత్వంను అవలంభిస్తారో, ఎంతటి మృదుత్వంను, మెతక వైకరిని పాటిస్తారో అల్లాహ్ కూడ అంతగానే ఆనందిస్తాడు. మీ శత్రువులను మీరు అల్లాహ్‌కు అప్పగించండి. ప్రళయ దినము సమీపంలో ఉన్నది. మీ శత్రువులు మీకు కల్గించే బాధల వలన మీరు ఆందోళన చెందవద్దు. వారి నుండి మీరు ఇంకా బాధలను అనుభవించవలసి ఉన్నట్లుగా నేను చూస్తున్నాను. ఎందుకనగా సభ్యతను వీడువారి నాలుకలు, వంతెన తెగినప్పుడు ప్రవహించే వరద వలే అదుపులేకుండా పలుకుతుంటాయి. కావున ధార్మికులు తమ నోటిని అదుపు చేసుకోవడం చాలా ముఖ్యం.”

**(మల్ఫూజాత్ సంపుటి 5, పేజి 130)**

మరల ఇలా తెలిపారు: “ వాస్తవానికి అల్లాహ్ ప్రాణుల పట్ల సానుభూతిని చూపించడమే గొప్ప విషయం. అలాంటి వారిని అల్లాహ్ తాలా చాలా ఇష్టపడుతాడు. అలాంటి వారిపై అల్లాహ్ తన సానుభూతిని చూపించడం కన్న గొప్ప విషయం మరేదైన ఉంటుందా?. ప్రాపంచిక వ్యవహారాలలో కూడ ఇలాగే జరగడం సర్వసాధారణం. ఒకవేళ ఒక సేవకుడు తన యజమాని మిత్రుని వద్దకు వెళ్ళినప్పుడు ఆ మిత్రుడు ఈ సేవకున్ని పట్టించుకోనిచో ఆ యజమాని అట్టి మిత్రున్ని హర్షించునా?. ఎన్నడు హర్షించడు. నిజానికి ఆ మిత్రుడు తన సేవకుడిన్ని ఏ విధముగాను బాధించలేదు. అయినా కూడ హర్షించడు. ఆ సేవకున్ని మర్యాదగా చూసుకోవడం, అతనితో మంచిగా వ్యవహరించడం అనేవి నిజానికి అట్టి యజమానితో వ్యవహరించినట్లు అనబడుతుంది. అదే విధముగా ఎవరైన తన దాసుల పట్ల కఠినముగా వ్యవహరించినచో అల్లాహ్ కూడ వారి పట్ల హర్షంను వ్యక్తపర్చడు. ఎందుకనగా అతనికి తన దాసులే ఎక్కువ ప్రీయమైనవారు. కావున అల్లాహ్ ప్రాణుల పట్ల సానుభూతిని వ్యక్తపర్చువారే నిజానికి తమ దైవ ప్రీతిని పొందువారగుదురు. ” **(మల్ఫూజాత్ సంపుటి 4, పేజి 215-216, నూతన ఎడిషన్)**

# మానవసేవ చేయడం మరియు పేదల పట్ల సానుభూతి చూపడమే అసలైన సౌందర్యం.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఘాషియ అధ్యాయపు 9వ సూక్తి వుజూహుమ్ యౌమ ఇజిన్ నాఇమతున్ ను విశ్లేషిస్తూ ఇలా తెలిపారు.

వాస్తవమేమిటనగా, మానవుడు ఒక వస్తువును కొన్ని సందర్భాలలో మంచిదిగా, మరికొన్ని సందర్భాలలో చెడుదిగా భావిస్తుంటాడు. ప్రేమ మరియు ద్వేషం వలన రూపాలు మారుతుంటాయి. నేను అనేక మంది భార్య భర్తల తగాదలను చూశాను. ముందుగా వారు ఒకరి తప్పిదాలను ఒకరు కప్పిపుచ్చుకుంటారు. దేవుడు తనకు అతి సుందరమైన భార్యను ఇచ్చాడని భర్త భావిస్తుంటాడు. కాని తగాదపడిన తరువాత ఆమే ముఖమే చూడడానికి వీలు లేనంత చెడుగా ఉన్నదని భర్త తిడుతుంటాడు. ఏది ఏమైన కూడ ఒకవేళ నాఇమతున్ అనే పదానికి బాహ్యా అర్థాన్ని తీసుకున్నచో వుజూఉవ్ం యౌమ ఇజిన్ నాఇమతున్ భావం ఈ విధముగా వచ్చును. వారు ఎంతో ఆమోధయోగ్యులవుతారు. చివరికి ప్రజలందరికి వారు చాలా సౌందర్యవంతముగా కనిపిస్తుంటారు. అంత మాత్రమున వారి రూపాలు కూడ అందముగా ఉంటాయని కాదు. ప్రపంచీకులకు వారు అందముగా, సౌందర్య వంతముగా కనిపిస్తుంటారు. అనగా వారు ప్రపంచానికి ఉపకారులుగా ఉన్నప్పుడు, వారు మానవసేవ చేసినప్పుడు, అనాధలను ఆధరించినప్పుడు, పేదల పట్ల సానుభూతిని చూపినప్పుడు, నిస్సహాయులకు చేయుతను అందించినప్పుడు (12వ పేజిలో చదువుము)

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

## బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం
## ఖలీఫతుల్ మసీహ్ జుమా ప్రసంగాలు మరియు ఉపన్యాసాల ప్రాధాన్యత, శుభములు:-

అల్లాహ్ తాలా తన ప్రియమైన పవిత్ర ఖుర్ఆన్‌లో విశ్వాసుల కొరకు ప్రవక్తల అవతరణను ఒక ఉపకారముగా నిర్ధారిస్తూ ఇలా తెలిపాడు.

**లఖద్ మన్నల్లాహు అలల్ మోమినీన ఇజ్‌బఅస ఫీహీం రసూలన్ మ్మిన్ అన్‌ఫుసిహీం యత్‌లూ అలైహిం ఆయాతిహీ వయుజక్కీహీం వయుఅల్లిముహుముల్ కితాబవల్ హిక్‌మత.** (ఆలే ఇమ్రాన్: 165)

అనువాదం: విశ్వాసులలో వారి నుండే ఒక ప్రవక్తను పంపి అల్లాహ్ నిశ్చయముగా వారికి గొప్ప ఉపకారము చేసెను. అతడు వారికి అతని సూక్తులను చదివి వినిపించును. వారిని పవిత్రీకరించును, వారికి గ్రంథమును బోధించి వివేకమును అందించును. ఇంతకు పూర్వము వారు నిశ్చయముగా సృష్టమైన దుర్మార్గములో నుండిరి.

మరల అల్లాహ్ తాలా ఖుర్ఆన్ కరీంలో తన మరియు ప్రవక్తల ఆదేశాలను గూర్చి హితోపదేశం చేస్తూ ఇలా తెలిపాడు.

**యా అయ్యుహల్లజీన ఆమనూ స్తజీబూ లిల్లాహీ వలిర్రసూలి ఇజ్ దఅకుం లిమా యూహీకుం.** (అన్‌ఫాల్:25)

అనువాదం: ఓ విశ్వాసులారా! అల్లాహ్, ప్రవక్త మిమ్ములను బ్రతికించుటకు పిలిచినప్పుడు ఉపస్థితులగుడు.

మనం జీవితాన్ని కొనసాగించడం కోసం అల్లాహ్ తాలా ఆకాశం నుండి రెండు రకాల నీటిని వర్షింపజేస్తాడు. వాటిలో ఒకటి మనకు కనిపించే నీరు. ఇది మేఘాల నుండి వర్షంగా కురుస్తుంటుంది. ఆపై భూమిపై ఉన్న నీటితో కలిసి మానవ మనుగడకు జీవనాధారంగా మారుతుంది. అలా ఈ నీరు ప్రాణధారమని పిలువబడుతుంది.

అదే విధముగా మానవుని ధార్మిక, ఆధ్యాత్మిక జీవనాధారం కొరకు మరొక ప్రాణాధారం ప్రవక్తలు, సందేశహరుల రూపంలో ఆకాశం నుండి అవతరిస్తుంది. ఈ గొప్ప ఉపకారమును గూర్చియే అల్లాహ్ తాలా ఆలే ఇమ్రాన్‌కు చెందిన పై సూక్తిలో ప్రస్తావించాడు. ఆ సూక్తిని నేను ఈ ఉపన్యాసం ముందు పేర్కొన్నాను. ఆ సూక్తిలో అల్లాహ్ తాలా ఇలా తెలిపాడు.

విశ్వాసులలో వారి నుండే ఒక ప్రవక్తను పంపి అల్లాహ్ నిశ్చయముగా వారికి గొప్ప ఉపకారము చేసెను. అతడు వారికి అతని సూక్తులను చదివి వినిపించును. వారిని పవిత్రీకరించును, వారికి గ్రంథమును బోధించి వివేకమును అందించును. ఇంతకు పూర్వము వారు నిశ్చయముగా సృష్టమైన దుర్మార్గములో నుండిరి.

నేటి కాలంలో సకల లోకాల సంరక్షకుడైన అల్లాహ్ తన ప్రియమైన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం అనుగ్రహాన్ని కొనసాగిస్తూ అట్టి సకల లోకాల కరుణామయుడి ఆధ్యాత్మిక కుమారుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా నేటి నుండి ప్రళయ దినం వరకు అట్టి ఆధ్యాత్మిక నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశాడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు.

" నాకు అందించబడిన పానియాన్ని నా హస్తము ద్వారా సేవించునట్టి వ్యక్తి ఎన్నడు మరణించడు." **(రుహానీ ఖజాయిన్ సంపుటి 3, పేజి 104)**

ఇట్టి ఆధ్యాత్మిక బోధనల, వివేకతల అనుగ్రహాన్ని నాటి సమాజంలో సుదీర్ఘకాలం కొనసాగించుటకు అట్టి విశ్వాసులు మరియు సత్కార్యపు ప్రజల కోసం అల్లాహ్ తాలా ఖిలాఫత్ పరంపరను ప్రారంభించాడు. నేటి మన కాలంలో కూడ అల్లాహ్ తాలా ఇస్లాం ధర్మపునరుద్ధరణ మరియు ఇస్లాం ధర్మ విస్తరణ కొరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పరమపదించిన తరువాత తన ద్వితీయ శక్తిని ప్రదరిస్తూ ఖిలాఫత్ పరంపరను ప్రారంభించాడు.

ఆధ్యాత్మిక నీటి ద్వారా లబ్ధి పొందడం వలన విశ్వాసులకు లభించే ఉన్నత స్థాయిలను గూర్చి ప్రస్తావించుతూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు ఇలా తెలిపారు:

"దైవ దూతల నుండి లబ్ధి పొందునట్టి మరొక మార్గం ఏమిటనగా, అల్లాహ్ తాలా ఏర్పాటు చేసిన ఖలీఫాలతో స్వచ్ఛయైన అనుబంధాన్ని ఏర్పర్చుకోవాలి. వారి పట్ల పూర్తి విధేయతను చూపాలి. .. అప్పుడు అల్లాహ్ తలా నుండి మీకు నూతన హృదయాలు లభిస్తాయి. వాటిలో మనశ్శాంతి ఏర్పడుతుంది. అట్టి హృదయాలను దైవదూతలు జాగ్రతగా చూస్తుంటారు.... అనుబంధం ఏర్పర్చుకోవడం వలన మీలో ఒక గొప్ప విప్లవాత్మక మార్పు కల్గుతుంది. మీలో ధైర్యసాహసాలు పెరిగిపోతాయి. మీ విశ్వాసం, నమ్మకంలు బలపడుతాయి. మీకు సహకరించడం కోసం దైవదూతలు తోడుగా నిలుస్తారు. మీ హృదయాలలో నిలకడ, అంకిత భావనల స్ఫూర్తిని నింపుతారు. మొత్తానికి సత్యఖలీఫాలతో అనుబంధాన్ని పెంచుకోవడం వలన దైవ దూతలతో అనుబంధం ఏర్పడుతుంది. అదే విధముగా దైవతేజస్సును ఆకర్షించే విధముగా మానవులను తీర్చిదిద్దుతారు. "

**(ఖిలాఫత్ అలా మిన్‌హాజే నబువ్వత్ సంపుటి 3, పేజి 392)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరణ ముఖ్యోద్దేశం ప్రపంచం మొత్తాన్ని ఏకతాటిపైకి తీసుకరావడం. మన జమాఅత్‌పైన అల్లాహ్ తాలా ఎంతటి అనుగ్రహం ఉన్నదనగా, అతడు అహ్మదియ్య ఖిలాఫత్‌తో మనలను అనుసంధానం చేశాడు. దీని కారణంగానే ప్రపంచ అహ్మదీయులందరు ఒకే త్రాటిపై ఏకమయ్యారు. అంతేగాకుండా ప్రపంచ ఐక్యతకు కావలసిన సామాగ్రిని, సాధనాలను కూడ అల్లాహ్ తాలా మన అందుబాటులోకి తీసుకవచ్చాడు. ఇట్టి నూతన మాధ్యమాలలో ఎంటిఏ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న సాధానం. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఎంటిఏ ఎల్లప్పుడు జమాఅత్ సభ్యులను, ఖలీఫాలతో అనుసంధానం చేస్తూనే ఉన్నది. వర్తమాన ఖలీఫా ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్నా కూడ , జమాఅత్ సభ్యులందరి దృష్టి ఆ ప్రాంతం వైపు మళ్ళుతుంది. హాలండ్ జల్సా జరుగుచున్నచో ప్రపంచ అహ్మదీయులందరు వర్తమాన ఖలీఫా ప్రసంగాన్ని వినుటకు హాలండ్ జల్సా కార్యక్రమాలను చూస్తుంటారు. ఫ్రాన్స్ జల్సా జరుగుచున్నచో ప్రపంచ అహ్మదీయులందరు ఎంటిఏ ద్వార ఫ్రాన్స్ జల్సాలో పాల్గొంటారు. మస్జిద్‌ల ప్రారంభోత్సవమైన, వర్తమాన ఖలీఫా గారి మరేదైన కార్యక్రమమైన ఎంటిఏ ద్వార ప్రసార మవుచున్నచో ప్రపంచ అహ్మదీయులందరు తమ తమ ఇళ్ళలో టీవి ముందు కూర్చొని సావధానంగా ఆలకిస్తూంటారు. ఈ సంవత్సరం ఇంగ్లాండ్ జల్సా సందర్భమున సయ్యద్‌నా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ప్రత్యేకించి ఈ జల్సాల ప్రత్యేకతలను గూర్చి ఇలా తెలిపారు:

" ఎంటిఏ ఈ జల్సా కార్యక్రమాలను 56 దేశాలకు చెందిన 119 కేంద్రాలతో అనుసంధానం చేసింది. అల్ హందులిల్లాహ్. ఐక్యతకు చెందిన ఇట్టి దృశ్యానికి ప్రతీక ప్రపంచంలోని ఏ జాతిలోనైన, ఏ మతంలోనైన, ఏ దేశంలోనైన కనిపిస్తుందా?. ఎన్నడు కనిపించదు."

ఈ దృశ్యాల వలన మనస్సు అల్లాహ్ తాలా స్మరణతో నిండి పోతుంది. మనస్సులో నుండి దుఆలు వెలువడుతుంటాయి. అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు ఎంతో ప్రియమైన జమాఅత్‌ను అందించాడు. వారందరి ఆలోచనలు వర్తమాన ఖలీఫా గారిని గూర్చియే. వారందరు ఈ ప్రపంచంలోనే ఉంటూ తమకంటూ ఒక నూతన ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకుంటు న్నారు. వారు తమ ఇమాంను ఎంతగా అభిమానిస్తుంటారనగా, వారి ఒక్కొక్క అక్షరాన్ని ఎంతో శ్రద్ధగా వింటూ ఉండడానికి ఎల్లప్పుడు సిద్ధముగా ఉంటారు. మొత్తానికి ఎంటిఏ అనుగ్రహం ద్వార క్రమం తప్పకుండా ప్రయోజనాన్ని పొందుతూనే ఉంటారు. తద్వార వర్తమాన ఖలీఫాతో అనుసంధానాన్ని పటిష్టం చేసుకోవచ్చునని భావిస్తారు. ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, మీరు ఏ స్థాయిలో ఖిలాఫత్ పట్ల ప్రేమను, అభిమానాన్ని, నమ్మకాన్ని, స్వచ్ఛతను పెంచుకుంటారో అంతే స్థాయిలో ఖిలాఫత్ శుభములు మరియు అనుగ్రహాల నుండి ప్రయోజనం పొందుతారు.

సయ్యదినా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఖిలాఫత్ పట్ల విధేయతను చూపే అంశంను, నమాజ్‌ను స్థాపించే అంశంతో ముడివేస్తూ ఇలా తెలిపారు:

"అల్లాహ్ తాలా నేడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వార ఈ అనుగ్రహపు పరంపరను అనగా ఖిలాఫత్ అనుగ్రహపు పరంపరను ప్రారంభించాడు. దీని నుండి లబ్ధి పొందుటకు ప్రతి అహ్మదీయుడు అల్లాహ్ తాలా యొక్క ఇట్టి ఆదేశాన్ని ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. అదేమనగా, సంపూర్ణ విధేయతను ప్రదర్శించే వారి కొరకే అతడు ఖిలాఫత్ అనుగ్రహాన్ని కొనసాగిస్తానని, వారే ఖిలాఫత్ అనుగ్రహాన్ని పొందుతారని తెలిపాడు.

అల్లాహ్‌తాలాను ఆరాధించాలనే విషయాన్ని ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ఎందుకనగా అల్లాహ్ తాలాను అధికముగా గుర్తు చేసుకునేవారే, అతనిని ఆరాధించే వారే అల్లాహ్ తాలా పట్ల సంపూర్ణ విధేయతను ప్రదర్శిస్తారు. ఆరాధనల గురించి మనకు తెలిసిన విషయమేమనగా, నమాజ్‌లను స్థాపించుము అని అల్లాహ్ తాలా మనకు పదే పదే ఆదేశించాడు. కావున నమాజ్‌లను స్థాపించడం చాలా ప్రధానమైన అంశం. ఇందుకోసం తమను తాము ఖిలాఫత్‌తో ముడిపడి ఉన్నామని భావించుకునే, ముడిపడి ఉండాలని ఆశించే వారు, ఖిలాఫత్ అనుగ్రహాన్ని పొందాలనుకునే ప్రతి అహ్మదీయుడు " తాము నమాజ్‌లను స్థాపించాలనే విషయం వైపు పూర్తి స్థాయి శ్రద్ధను కల్గియుండాలి." అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు గారు నమాజ్ స్థాపించే విషయాన్ని గూర్చి వివరిస్తూ ఒక చోట ఎంతో గొప్పగా ఇలా తెలిపారు:

"నమాజ్ యొక్క అద్భుతమైన భాగం జుమా ప్రసంగం. అందులో ఇమాం ప్రసంగిస్తాడు. హితబోధనలు చేస్తాడు. వర్తమాన ఖలీఫా ప్రపంచ పరిస్థితులను, ప్రపంచంలోని విభిన్న జాతులకు కావలసిన అవసరాలను దృష్టి యందుంచుకొని, జాతి ఐక్యతకు, సామరస్యతలతకు చెందిన సూచనలు, సలహాలను ఇస్తుంటారు. "

**(తఫ్సీరే కబీర్ సంపుటి 8, పేజి 575)**

వర్తమాన ఖలీఫా అందరి దృష్టిని ఒకేవైపు కేంద్రీకృతం చేస్తాడు. ఇందుకు సరైన ముఖచిత్రాన్ని నేడు మనం చూస్తూనే ఉన్నాము. నేడు ఎంటిఏ ద్వార అల్లాహ్ తాలా ఒకగొప్ప వ్యవస్థను స్థాపించాడు. తద్వార వర్తమాన ఖలీఫా ప్రసంగాన్ని అన్ని దేశాలలో, అన్ని ప్రాంతాలలో, అన్ని నగరాలలో, ప్రతి గ్రామమంలో చూడడం, వినడం జరుగుతుంది. వర్తమాన ఖలీఫా మాటలు కేవలం టీవి ముందు కూర్చున్న ప్రజల కోసమే కాకుండా ప్రతి ఒక్కరికి వర్తిస్తాయి. నిజానికి ఆఫ్రికా, రష్యా వంటి దేశాల ప్రజలు కూడ మీరు తెల్పిన విషయాలు మా పరిస్థితులకు అనుకూలంగానే ఉన్నాయి, కావున వాటిని వినడం వలన మా సంస్కరణ కూడ జరుగుతుందని, నిజానికి ఖిలాఫత్ వ్యవస్థ మా అందరిని ఒకే త్రాటిపైకి తీసుకవచ్చిందని అక్కడి ప్రజలు నాకు చాల లేఖలు వ్రాస్తుంటారు. **(7వ పేజీలో చదువుము)**

# జుమా ప్రసంగము

**తాయిఫ్ మరియు హవాజిన్ ప్రజలకు, మక్కా ప్రజలతో, ముఖ్యంగా ఖురైష్‌తో కుటుంబపరమైన మరియు లోతైన ఆర్థిక సంబంధాలు ఉండెను. ఒకరితో ఒకరు వివాహాల ద్వారా కూడా సంబంధాలు ఉండెను. ఈ కారణంగా, శాంతి చర్చల కోసం హ్రజత్ అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్ మరియు హ్రజత్ ముఘీరా బిన్ షుబా కోట లోపలికి వెళ్లారు, కానీ వారికి కూడా విజయం దక్కలేదు.**

---

**కేవలం సంప్రదింపుల ఫలితంగానే కాకుండా, అల్లాహ్ తఆలా నుండి ఏదైనా ప్రత్యేక మార్గదర్శకత్వం లేదా సూచన లభించడం వల్లనే మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ముట్టడిని ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. లేకపోతే, తన యుద్ధ కార్యకలాపాలలో, ఇంత ముఖ్యమైన మరియు అవసరమైన విజయాన్ని పైకి అసంపూర్తిగా వదిలి వెళ్ళడం ఇదే మొదటిసారి.**

---

**"సూది, దాని దారం లేదా అంతకంటే చిన్న వస్తువు ఏదైనా ఎవరి దగ్గర ఉన్నా, వారు తిరిగి ఇచ్చేయండి. విశ్వాసఘాతానికి దూరంగా ఉండండి, ఎందుకంటే తీర్పు రోజున ఈ విశ్వాసఘాతం చేసేవారికి అపకీర్తికి, మచ్చకు కారణమవుతుంది."**

---

**ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంకా ఇలా అన్నారు: "ఈ వ్యక్తి మరియు అతని సహచరులు ఖురాన్‌ను చదువుతారు, కానీ అది వారి గొంతుకల క్రిందికి దిగదు (అర్థం చేసుకోరు). వారి విశ్వాసం ఉపరితలంగా (తేలికగా) ఉంటుంది. మరియు బాణం వేట జంతువు నుండి ఆ విధంగా దూసుక వెళ్ళినట్లుగా, వారు ధర్మం నుండి బయటకు వెళ్లిపోతారు. దానిపై రక్తపు ఆనవాళ్లు కూడా ఉండవు. మీరు వారి నమాజ్ మరియు ఉపవాసాల ముందు మీ నమాజ్ మరియు ఉపవాసాలను తక్కువగా భావిస్తారు. (అంటే, వారు పైకి ఎక్కువ మరియు క్రమ బద్ధమైన నమాజ్ చేస్తారు మరియు ఉపవాసం పాటించడంలో కఠినంగా ఉంటారు.)"**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 19 సెప్టెంబర్ 2025, ( 19 తబూఖ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

గత ఖుత్బాలలో తాయిఫ్ యుద్ధం గురించి ప్రస్తావన జరుగుతుండెను. ఆ సందర్భంలో ఒక అనుచరుడు వారి (తాయిఫ్ ప్రజల)తో మాట్లాడటానికి వెళ్లారు. తమకు ఏమీ జరగదని తాయిఫ్ ప్రజలు అతనికి హామీ కూడా ఇచ్చారు, కానీ అతను కోట దగ్గరకు వెళ్ళగానే అతను అమరుడయ్యాడు. ఇలా ఆ ప్రజలు ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అయితే, తాయిఫ్ ప్రజలు ఈ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడినప్పటికీ, ప్రవక్త హ్రజత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) శాంతి ప్రయత్నాలను వదులుకోలేదు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మరల హ్రజత్ హన్జలా బిన్ రబీ'అను తాయిఫ్ ప్రజల వద్దకు పంపారు. ఆయన కోట దగ్గరకు చేరుకుని, చర్చల సందేశాన్ని పంపినప్పుడు, వారిలో కొందరు మాట్లాడటానికి బయటకు వచ్చారు. హ్రజత్ హన్జలా మీరు శాంతి కావాలనుకుంటున్నారా లేదా అని అడిగారు. వారు ఏమీ చెప్పకుండా, హ్రజత్ హన్జలాపై దాడి చేసి, అతన్ని పట్టుకుని కోట లోపలికి తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. దీనిపై మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రకటించారు: "హన్జలాను రక్షించి తీసుకువచ్చే వారు ఎవరు? అతనికి మన యోధులందరికీ లభించేంతటి పుణ్యం మరియు ప్రతిఫలం లభిస్తుంది." అప్పుడు హ్రజత్ అబ్బాస్ పరుగెత్తుకుంటూ వెళ్లి, బహుదైవారాధకుల పంజా నుండి హ్రజత్ హన్జలాను విడిపించి తీసుకొని వచ్చారు. వెనక్కి వచ్చేటప్పుడు, శత్రువులు కోట నుండి రాళ్ళు కూడా విసిరారు, కానీ వారు ఆ అవిశ్వాసుల రాళ్ల దాడి నుండి రక్షించబడ్డారు.

**(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 352-353, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

గత ఖుత్బాలలో చెప్పినట్లుగా, తాయిఫ్ మరియు హవాజిన్ ప్రజలకు, మక్కా ప్రజలతో, ముఖ్యంగా ఖురైష్‌తో కుటుంబపరమైన మరియు లోతైన ఆర్థిక సంబంధాలు ఉండెను. ఒకరితో ఒకరు వివాహాల ద్వారా కూడా సంబంధాలు ఉండెను. ఈ కారణంగా, శాంతి చర్చల కోసం హ్రజత్ అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్ మరియు హ్రజత్ ముఘీరా బిన్ షుబా కోట లోపలికి వెళ్లారు, కానీ వారికి కూడా విజయం దక్కలేదు. అయితే, కోటలోని ప్రజలు ఒక విన్నపం చేశారు: "ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో చెప్పండి, దేవుని కోసం మరియు బంధుత్వం కోసం మా తోటలకు నష్టం కలిగించవద్దు, వాటిని అలాగే ఉంచనివ్వండి." వారు స్వయంగా ఏ ఒప్పందానికి కట్టుబడి ఉండరు, కానీ తమపై దయ చూపాలని అభ్యర్థిస్తున్నారు. వారి అభ్యర్థన మేరకు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి తోటలను నాశనం చేయాలనే ఆదేశాన్ని ఉపసంహరించుకున్నారని ఇదివరకే చెప్పబడింది. **(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 358-359, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్రలో ఇది ఒక అద్భుతమైన కోణం %-% అనేక రోజులుగా ముట్టడి కొనసాగుతున్నప్పటికీ, ఆయన అటువంటి గొప్ప ఔదార్యం మరియు ధైర్యాన్ని ప్రదర్శించారు. తోటలను నరికివేయమని ఆదేశించి ఉంటే, అది యుద్ధంలో ముస్లింల వైపు మొగ్గు చూపే ఒక యుద్ధ వ్యూహం అయ్యేది. కానీ వారు దేవుని పేరుతో మరియు బంధుత్వం పేరుతో వేడుకున్నప్పుడు, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అభ్యర్థనను అంగీకరించారు మరియు పైకి చాలా పెద్ద సైనిక నష్టాన్ని అంగీకరించారు.

ఈ సందర్భంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక ప్రకటన చేయించారు: "కోట గోడ నుండి దిగి వచ్చి మనతో కలిసే ఏ బానిస అయినా విముక్తుడు అవుతాడు." దీనితో, ఇరవై మూడు మంది బానిసలు దిగి వచ్చి ముస్లింలతో కలిశారు. తాయిఫ్ ప్రజలు దీనికి చాలా బాధపడ్డారు. పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారందరినీ విముక్తులను చేశారు. వారిలో ఒక్కొక్కరిని ఒక్కొక్క ముస్లింకు అప్పగించారు మరియు వారి పోషణ బాధ్యతను ఆ ముస్లింకు అప్పగించారు.

**(షరఅ జర్కాని, అలల్ మవాహిబ్, లిద్దునియా సంపుటి 4, పేజి 11-13, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1996) (సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 5 పేజి 384, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1993)**

మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ బానిసల గురించి వారికి మంచిగా ధర్మాన్ని నేర్పించాలని కూడా ఉపదేశించారు. కొంతకాలం తరువాత, తాయిఫ్ ప్రజలు ఇస్లాంను అంగీకరించినప్పుడు, వారు తమ పాత బానిసల గురించి మాట్లాడారు మరియు మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను తమ బానిసలను తమకు తిరిగి ఇవ్వాలని అభ్యర్థించారు. దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అభ్యర్థనను తిరస్కరించారు. ఈ బానిసలలో కొందరు ఇస్లాం చరిత్రలో మంచితనం మరియు భక్తిలో పేరు సంపాదించారు, వారిలో హ్రజత్ అబూ బక్రా కూడా ఒకరు. **(ఘజ్వా హునైన్, బాష్మీల్ పేజి 235-236, నఫీస్ అకాడమీ)**

ఒక సందర్భంలో, ఉయైనా బిన్ హిస్న్ ఫజారీ అనే వ్యక్తి కోట లోపలికి వెళ్లి బనూ సఖీఫ్‌ను ఇస్లాం వైపు ఆహ్వానించడానికి రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి అనుమతి కోరాడు. ఇతను అహ్జాబ్ యుద్ధం (ఖందక్) సమయంలో అవిశ్వాసుల పక్షాన బనూ ఫజారాకు నాయకుడు. అహ్జాబ్ యుద్ధంలో ఓటమి తర్వాత కూడా, ఇతను మదీనాపై దాడి చేయాలని అనుకున్నాడు, కానీ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నగరం వెలుపలకి వచ్చి ఇతని దాడిని నిలువరించి, వెనక్కి వెళ్ళమని బలవంతం చేశారు. ఇతను మక్కా విజయం (ఫతహ్ మక్కా)కు ముందు ఇస్లాం స్వీకరించాడు మరియు ఆ విజయంలో కూడా పాల్గొన్నాడు. మక్కా విజయం సమయంలో ఇతను పైకి ముస్లింగా ఉన్నాడు. హునైన్ మరియు తాయిఫ్ యుద్ధాల్లో కూడా పాల్గొన్నాడు. హ్రజత్ అబూబక్ర్ (రజియల్లాహు అన్హు) ఖలీఫా పాలనలో, తిరుగుబాటు చేసిన మతభ్రష్టులతో కలిసి ఇతను కూడా మతభ్రష్టత్వపు అల్లర్లకు బలైపోయాడు. ప్రవక్తనని చెప్పుకున్న తులైహా వైపు మొగ్గు చూపి, అతనికి విధేయత ప్రకటించి, అతనితో కలిసి ఇస్లామి సైన్యాలపై పోరాడాడు. దారుణంగా ఓడిపోయి, ఖైదీగా హ్రజత్ అబూబక్ర్ ముందు హాజరుపరిచినప్పుడు, ఇతను పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. హ్రజత్ అబూబక్ర్ అతన్ని క్షమించారు, మరియు ఇతను మళ్ళీ ఇస్లాం స్వీకరించాడు. అప్పుడు ఇతను "గతంలో నేను ఎప్పుడూ పూర్తిగా విశ్వసించలేదు" అని కూడా చెప్పాడు. ఇతని గురించి, ఇతను గర్విష్ఠి మరియు కఠినమైన వ్యక్తి అని, తన తెగకు చెందిన ప్రసిద్ధ యోధుడు మరియు నాయకుడు అని వ్రాయబడింది. ఇతని గురించి ప్రవక్త హ్రజత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) "అల్-అహ్మక్ ముతా" (అనగా తెలివితక్కువ నాయకుడు) అని వర్ణించినట్లు కూడా తెలుస్తోంది. ఏదేమైనా, ఉయైనా వెళ్తానని చెప్పినప్పుడు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి అనుమతి ఇచ్చారు. ఉయైనా కోటలోకి వెళ్లి ఆ ప్రజల దగ్గరకు చేరుకున్నాడు. అయితే, ఇస్లాం వైపు ఆహ్వానించే బదులు, అతను బనూ సఖీఫ్‌తో ఇలా అన్నాడు: "మీరు మీ కోటలో గట్టిగా నిలబడండి, ఎందుకంటే మా పరిస్థితి బానిసల కంటే హీనంగా మారుతోంది."

ఒక కథనంలో, "ఏ పరిస్థితుల్లోనూ మీ కోటను వదలవద్దు మరియు దేనికీ కలత చెందవద్దు" అనే పదాలు కూడా ఉన్నాయి. ఉయైనా తిరిగి రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చినప్పుడు, ఆయన అడిగారు: "ఉయైనా, నువ్వు ఆ ప్రజలతో ఏం చెప్పావు?" అతను బదులిచ్చాడు: "నేను వారికి ఇస్లాం స్వీకరించమని సలహా ఇచ్చాను, ధర్మం వైపు ఆహ్వానించాను, నరకం గురించి భయపెట్టాను మరియు స్వర్గానికి మార్గం చెప్పాను." అయితే, అతను అక్కడ ఏమి చెప్పాడో అల్లాహ్ తఆలా దైవ వాణి ద్వారా మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు తెలియజేశాడు. అందువల్ల, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "నువ్వు అబద్ధం చెబుతున్నావు. నువ్వు ఆ ప్రజలతో ఇవి ఇవి చెప్పావు" మరియు ఉయైనా అక్కడ చెప్పిన మాటలన్నీ తిరిగి చెప్పారు. ఇది విని ఉయైనా ఆశ్చర్యపోయాడు. అతను ఇలా అన్నాడు: "ఓ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం), మీరు నిజం చెబుతున్నారు. నేను నా ఈ చర్యకు మీ ముందు మరియు అల్లాహ్ తఆలా ముందు పశ్చాత్తాపపడుతున్నాను."

**(సీరతుల్ హలబియ్యా, సంపుటి 3, పేజి 168, సంపుటి 2, పేజి 376, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2002)(అసాబ సంపుటి 4, పేజి 639, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1995)(అల్ ఇస్తియాబ్, సంపుటి 3, పేజి 317, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్2002)(హజ్రత్ సయ్యదినా అబూబకర్ సిద్ధీఖ్ , ముహమ్మద్ హుస్సైన్ హైకల్ పేజి 139, బుక్ కార్నర్ షోరూమ్) (దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 360-361, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

అయితే, అతని విశ్వాసం అప్పటికీ పూర్తిగా స్థిరపడలేదు.

ముట్టడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ నౌఫల్ బిన్ ముఆవియా దియ్లీని సంప్రదించారు. అప్పుడు ఆయన (నౌఫల్) ఇలా విన్నవించుకున్నారు: "ఇది నక్క తన సంచి (బస్తా) లో దూరినట్లు ఉంది. దాని వద్ద నిలబడితే, పట్టుకుంటాం. వదిలేస్తే, అది నష్టం కలిగించే శక్తిని కలిగి ఉండదు." (నక్క తన గుహలోకి వెళుతుంది). ఇది విన్న రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ముట్టడిని ముగించాలని నిర్ణయించుకున్నారు మరియు హజ్రత్ ఉమర్ ద్వారా ప్రజలలో "ఇన్షా అల్లాహ్, రేపు తిరిగి వెళ్తాము" అని ప్రకటించారు. **(తారీఖే తిబ్రీ, సంపుటి 2, పేజి 172, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్1987)(అర్రహీఖుల్ మఖ్తూమ్ ఉర్దూ అనువాదం, పేజి 568, మక్తబల్ సలఫియ్య లాహోర్ 2002)**

బహుశా, కేవలం సంప్రదింపుల ఫలితంగానే కాకుండా, అల్లాహ్ తఆలా నుండి ఏదైనా ప్రత్యేక మార్గదర్శకత్వం లేదా సూచన లభించడం వల్లనే మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ముట్టడిని ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. లేకపోతే, తన యుద్ధ కార్యకలాపాలలో, ఇంత ముఖ్యమైన మరియు అవసరమైన విజయాన్ని పైకి అసంపూర్తిగా వదిలి వెళ్ళడం ఇదే మొదటిసారి.

విమర్శకులు లేదా చరిత్ర రచయితలు ఏది రాసినా, చరిత్రలో మనం చూసినదేమిటంటే: దీని కంటే కష్టమైన మరియు అసాధ్యమైన పోరాటాలలో కూడా అల్లాహ్ తఆలా ఆయనకు అసాధారణ విజయాన్ని మరియు సహాయాన్ని ప్రసాదించాడు. బనూ ఖురైజా మరియు ఖైబర్ విజయాలు దీనికి ఉజ్వల ఉదాహరణలు. హునైన్ ఉదాహరణ కూడా అప్పటికి చాలా సమీపంలోనే జరిగినది, దాన్ని ఎలా మర్చిపోగలం? హునైన్ సమయంలో, కొంతమంది మక్కా ప్రజలు కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఓటమిని ఖచ్చితంగా నమ్మారు, మరియు వారిలో ఒక వర్గం ఆయన ఓటమిని తమాషాగా చూడటానికి ఆయనతో కలిసి వచ్చారు. కానీ అప్పుడు కూడా, అల్లాహ్ తఆలా ఖచ్చితమైన ఓటమిని అద్భుతమైన, అసాధారణమైన మరియు చారిత్రక విజయంగా మార్చాడు. తాయిఫ్లో ఉన్నది కూడా అదే పారిపోయిన, ఓడిపోయిన సైన్యం, లోపల భయంతో కూర్చున్నారు. గతంలో లభించిన దైవ సహాయాన్ని చూసినట్లయితే, తాయిఫ్‌ను జయించడం కూడా పెద్ద కష్టమైన లేదా అసాధ్యమైన పని కాదు. అయితే, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) పైకి ఈ ఓటమిని అంగీకరించినట్లు కనిపించి, ముట్టడిని ముగించినట్లు ప్రకటించారు. నిజానికి, దీని ద్వారా మనకు పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్రలో ఒక అత్యంత ప్రకాశవంతమైన కోణం కనిపిస్తుంది. అదేమిటంటే: ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సైనిక చర్య ఏ విధమైన వ్యక్తిగత ఉద్రేకంతో చేసినది కాదు. యుద్ధ సొమ్ము సంపాదించడానికి లేదా భూములను జయించడానికి కాదు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ప్రతి కదలిక, విశ్రాంతి, మాట మరియు పని జ్ఞానమున్న, అంతా తెలిసిన దేవుని సంకల్పానికి లోబడి ఉండేది. ఆయన జీవితమంతా ఈ ఖురాన్ ఆయత్‌కు నిదర్శనం: **"ఖుల్ ఇన్న సలాతీ వ నుసుకీ వ మహ్యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్"** (అనామ్: 163) అనగా వారికి చెప్పు: నా నమాజు, నా బలిదానం, నా జీవితం మరియు నా మరణం సమస్త లోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే.

తాయిఫ్ ముట్టడి సందర్భంగా, రెండు విషయాలు జరిగాయి. దీని ద్వారా, ముట్టడిని ముగించాలని అల్లాహ్ తఆలా నుండి ఆయనకు (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గదర్శకత్వం లభించిందని స్పష్టమవుతుంది మరియు ఆయన వెంటనే ముట్టడిని ముగించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంలో, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు వచ్చిన ఒక స్వప్నం గురించిన ప్రస్తావన ఉంది: ఇబ్నె హిషామ్ రాసిన దాని ప్రకారం, తాయిఫ్ ముట్టడి సమయంలో, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అబూబక్ర్ (రజియల్లాహు అన్హు)తో ఇలా అన్నారు: "ఓ అబూబక్ర్! ఈ రోజు నేను కలలో ఒక పాత్ర నిండా వెన్న బహుమతిగా వచ్చినట్లు చూశాను. అప్పుడు ఒక కోడిముక్కు ఆ పాత్రను పొడిచి, దాన్ని పడగొట్టింది." అప్పుడు అబూబక్ర్ విన్నవించుకున్నారు: "నా ఉద్దేశం ఏమిటంటే, ఈసారి మీరు 'సఖీఫ్' నుండి మీరు కోరుకున్నది సాధించలేరు." (అంటే, మనం అనుకున్న విజయం లభించడం కష్టం). రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "నా ఉద్దేశంలో కూడా దీనిని (విజయాన్ని) పొందడం ప్రస్తుతానికి అసాధ్యమే."

**(సీరత్ ఇబ్నే హిషామ్, పేజి 793, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2001)(దాయిరే మాఅరిఫ్ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 366, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

ఖౌలా బింత్ హకీమ్ (లేదా ఖువైలా), హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్'ఊన్ భార్య కూడా ఒక కథనంలో ప్రస్తావించబడ్డారు. ఆమె రసూల్ కరీం (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధిలో ఇలా విన్నవించుకున్నారు: "యా రసూలుల్లాహ్! అల్లాహ్ తఆలా మీకు తాయిఫ్ విజయాన్ని ప్రసాదిస్తే, బాదియా బిన్ గైలాన్ లేదా ఫారియా బింత్ అఖీల్ నగలు నాకు దయచేయండి. ఎందుకంటే, సఖీఫ్‌లో ఆ స్త్రీలంతటి విలువైన నగలు వేరే ఏ స్త్రీ వద్ద లేవు." దానికి రసూల్ కరీం (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెతో ఇలా అన్నారు: "ఓ ఖౌలా, సఖీఫ్‌ను జయించడానికి నాకు అనుమతి లభించకపోతే, అప్పుడు ఏమి చేస్తావు?" హజ్రత్ ఖౌలా అక్కడి నుండి బయలుదేరి, ఈ విషయాన్ని హజ్రత్ ఉమర్ (రదియల్లాహు అన్హు)తో ప్రస్తావించారు. హజ్రత్ ఉమర్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, "యా రసూలుల్లాహ్! ఖౌలా ఏమంటున్నారో చూడండి. మీరు ఆమెతో ఆ మాట అన్నారని ఆమె చెబుతోంది" అని విన్నవించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "అవును, నేను అన్నాను" అని ధృవీకరించారు. హజ్రత్ ఉమర్ వెంటనే అర్థం చేసుకుని, విన్నవించుకున్నారు: "ఈ విజయం లేదా ఈ యుద్ధాన్ని కొనసాగించడం గురించి మీకు అనుమతి లభించలేదా?" పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "లేదు" అని అన్నారు. హజ్రత్ ఉమర్ విన్నవించుకున్నారు: "అయితే, నేను ప్రజలను ప్రయాణించడానికి సిద్ధం కమ్మని చెప్పమంటారా?" ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) "అవును" అని అన్నారు. దీంతో, అనుమతి లభించిన వెంటనే, హజ్రత్ ఉమర్ అక్కడి నుండి వెనక్కి తిరిగి వెళ్లాలని ప్రకటించారు.

**(సుబులుల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పేజి 387, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్1993)(ఉసదుల్ ఘాబా పేజి 1509 మక్తబ దారే ఇబ్నే హజమ్)**

ఈ ఉపసంహరణ ప్రకటన వెలువడినప్పుడు, కొంతమంది ప్రజలు "విజయం లేకుండా మనం ఎందుకు తిరిగి వెళ్తున్నాము?" అని ప్రశ్నించారు. ఇది కొందరు ఉద్వేగభరిత యువకుల ప్రతిచర్య అని తెలుస్తోంది. మొదట, వారు హజ్రత్ అబూబక్ర్ మరియు హజ్రత్ ఉమర్ వద్దకు వెళ్ళి, విజయం సాధించే వరకు ముట్టడిని కొనసాగించాలని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ని అభ్యర్థించమని కోరారు. కానీ, వారు (అబూబక్ర్ మరియు ఉమర్) "ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏ నిర్ణయం తీసుకున్నా, అది సరైనదే" అని చెప్పి, ఆ అభ్యర్థన చేయడానికి నిరాకరించారు. దీనితో, ఈ ఉద్వేగభరిత యువకులు నేరుగా మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వెళ్ళి, ఉద్వేగంతో "ప్రభూ, మేము పోరాడుతాము" అని విన్నవించుకున్నారు. వారి కోరిక మేరకు, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "సరే, రేపు ఉదయం పోరాడండి" అని అన్నారు. తదనుగుణంగా, వారు మరుసటి రోజు పోరాడటానికి బయలుదేరారు, కానీ వారికి గాయాలు తప్ప మరేమీ లభించలేదు. దీనిపై ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "మనం ఇన్షా అల్లాహ్, రేపు బయలుదేరి వెళ్తాము." యుద్ధం వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా గాయాలతో తిరిగి వచ్చిన తరువాత, వారందరూ కూడా వెనక్కి తిరిగి వెళ్లాలనే నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వారి అభిప్రాయంలో వచ్చిన ఈ మార్పును చూసి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా చిరునవ్వు నవ్వారు.

**(షరహ జర్కాని అలల్ మవాహిబ్ లిద్దునియా సంపుటి 4, పేజి 13-14, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1996)(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 368-369, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

ఈ యుద్ధంలో అవిశ్వాసులలో ముగ్గురు మరణించారు. అయితే, వారు కోట లోపలే బంధీలుగా ఉన్నందున, వారి గాయపడినవారు మరియు ఇతర మరణించిన వారి గురించి ఎక్కువ వివరాలు లభ్యం కాలేదు. అదేవిధంగా, ముస్లింల గాయపడిన వారి ఖచ్చితమైన సంఖ్య కూడా తెలియదు, కానీ కొంతమంది గాయాల గురించి వివరాలు లభిస్తాయి. బహుదైవారాధకులు వేసిన బాణాల కారణంగా గాయపడిన వారిలో హజ్రత్ అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్ కూడా ఉన్నారు. ఒక బాణం వారి కంటికి తగిలింది, దాని వలన వారి కన్ను బయటకు వచ్చింది. వారు తమ కన్ను చేతిలో పట్టుకొని నేరుగా రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చారు మరియు విన్నవించుకున్నారు: "యా రసూలుల్లాహ్, నా ఈ కన్ను అల్లాహ్ మార్గంలో పోయింది." ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "నీకు కావాలంటే, నేను ప్రార్థన చేస్తాను, నీ ఈ కన్ను తిరిగి దాని స్థానంలో సరిగ్గా ఉంటుంది. ఒకవేళ కన్ను వద్దు అనుకుంటే, నీకు స్వర్గం లభిస్తుంది." ఒక కథనంలో ఈ పదాలు ఉన్నాయి: కన్ను వద్దు అనుకుంటే, స్వర్గంలో నీకు ఐన్ (జలధార, దయ యొక్క ఊట) లభిస్తుంది. అరబీ భాషలో 'ఐన్' అనే పదానికి కన్ను మరియు జలధార అనే రెండు అర్థాలు ఉన్నాయి. అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు: "నాకు స్వర్గమే ప్రియమైనది." ఈ మాట చెప్పి, ఆయన తన చేతితో ఆ

కంటిని విసిరివేశారు. మక్కా విజయం వరకు ఇస్లాంకు తీవ్ర శత్రువుగా ఉండి, ఉహుద్ యుద్ధంలో అవిశ్వాసుల సైన్యాధిపతిగా ఉన్న ఈ అబూ సుఫ్యాన్, ఇప్పుడు ముస్లిం అయిన తర్వాత త్యాగాలలో ముందున్నారు. విచిత్రంగా, వారి రెండవ కన్ను యర్మూక్ యుద్ధంలో పోయింది.

**(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 373, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

అదేవిధంగా, గాయపడిన మరొక అనుచరుడు హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ కుమారుడు అబ్దుల్లా (రజియల్లాహు అన్హు). వారికి తగిలిన గాయం చాలా కాలం కొనసాగింది మరియు ప్రాణాంతకమైంది. చివరికి, తన తండ్రి హజ్రత్ అబూబక్ర్ (రజియల్లాహు అన్హు) ఖిలాఫత్ కాలంలో, అదే గాయం కారణంగా వారు మరణించారు. **(సీరతుల్ హలబియ్య సంపుటి 3, పేజి 169, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ హిజ్రి 1423)**

గత యుద్ధాల మాదిరిగానే, ఈ యుద్ధంలో కూడా పన్నెండు మంది అనుచరులు (రజియల్లాహు అన్హుమ్) అమరులయ్యారు లేదా గాయాల వల్ల మరణించారు. వారి పేర్లు ఇక్కడ ఇవ్వబడ్డాయి: 1.హజ్రత్ సఈద్ బిన్ ఆస్ 2.హజ్రత్ అర్ఫతా బిన్ జనాబ్ 3.హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఉమయ్యా, 4.హజ్రత్ అబ్దుల్లా బిన్ ఆమిర్ 5. హజ్రత్ సా'ఇబ్ బిన్ హారిస్ మరియు వారి సోదరుడు, 6. హజ్రత్ అబ్దుల్లా బిన్ హారిస్ 7. హజ్రత్ జులైహా బిన్ అబ్దుల్లా, 8. హజ్రత్ సాబిత్ బిన్ జల్లా, 9. హజ్రత్ హారిస్ బిన్ సహల్, 10.హజ్రత్ మున్జిర్ బిన్ అబ్దుల్లా, 11. హజ్రత్ రఖీమ్ బిన్ సాబిత్ 12. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబూబక్ర్ (వీరు గాయాల ఫలితంగా కొంతకాలం తర్వాత మరణించారు). **(సీరత్ ఇబ్నే హష్షామ్, పేజి 794-795, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2001)**

ఈ యుద్ధంలో రసూల్ కరీం (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంట ఆయన ఇద్దరు సతీమణులు హజ్రత్ ఉమ్మె సలమా మరియు హజ్రత్ జైనబ్ (రదియల్లాహు అన్హుమా) ఉండిరి. వారిద్దరి కోసం రెండు గుడారాలు ఏర్పాటు చేయబడ్డాయి. ముట్టడి సమయంలో, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ రెండు గుడారాల మధ్య నిలబడి నమాజ్ చేసేవారు.

**(అత్తభ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, భాగం 2, పేజి 120, ఘజ్వాతు ర్రసూల్ (స) తాయిఫ్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్1990)**

తాయిఫ్ ముట్టడి ఎన్ని రోజులు జరిగింది అనే విషయంలో అనేక కథనాలు ఉన్నాయి: కొందరు పదికి పైగా రాత్రులు ముట్టడి జరిగిందని అంటారు. ఇబ్న్ హిషామ్ ప్రకారం, ఇది పదిహేడు రాత్రులు జరిగిందని కూడా చెబుతారు. కొందరు ఇరవై రోజులు ముట్టడి జరిగిందని అంటారు. కొన్ని కథనాలలో, ఇరవైకి పైగా రాత్రులు ముట్టడి జరిగిందని ఉంది. మరొక కథనం ప్రకారం, రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ముప్పైకి దగ్గరగా రాత్రులు తాయిఫ్ ప్రజలను ముట్టడించారు. సహీహ్ ముస్లింలో హజ్రత్ అనస్ నుండి వచ్చిన ఒక కథనంలో, "మేము నలభై రాత్రులు వారిని ముట్టడించాము" అని ఉంది.

**(సీరతున్నబవియ్యతు లి ఇబ్నే హష్షామ్ పేజి 792, జికర్ ఘజ్వా తాయిఫ్ బాద్ హునైన్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2001)(సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 5, పేజి 388, ఫీ ఘజ్వతు త్తాయిఫ్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్: 1993)(సహి ముస్లిం కితాబు జ్జకాత్ బాబ్ అతాఉల్ మౌసతు ఖులూబు హుం అలల్ ఇస్లామీ హదీస్ సంఖ్య 2442)**

వెనక్కి బయలుదేరే సమయం వచ్చినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ మాటలు చదువుతూ వెనక్కి వెళ్లాలని ఆదేశించారు: **"ఆ'ఇబూన తా'ఇబూన ఆ'బిదూన లిరబ్బినా హామిదూన్"** (మేము తిరిగి వెళ్తున్నాము, పశ్చాత్తాపపడుతున్నాము, ఆరాధిస్తున్నాము మరియు మా ప్రభువును పొగుడుతున్నాము.) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)తో "యా రసూలుల్లాహ్! బనూ సఖీఫ్‌ను శపించండి అని విన్నవించబడింది.

విశాల హృదయం మరియు దయగల ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) లక్షణం ఏమిటంటే, పైకి విజయం సాధించకుండా వెనక్కి వెళ్తున్నప్పటికీ, ఆయన వారి కోసం శపించే బదులు ఈ ప్రార్థన చేశారు: **"అల్లాహుమ్మ అహ్ది సఖీఫన్ వ'అతి బిహి అల్-ముస్లిమీన్"** (ఓ అల్లాహ్! సఖీఫ్‌కు మార్గనిర్దేశం చేయి మరియు వారిని ముస్లింలుగా తీసుకురా.)

ఆ తర్వాత, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడి నుండి తిరిగి వెళ్లడానికి సవారీ ఎక్కినప్పుడు ఈ ప్రార్థన చేశారు: **"అల్లాహుమ్మ అహ్దిహుమ్ వక్ఫినా మౌనతహుమ్"** (ఓ అల్లాహ్! వారికి మార్గనిర్దేశం చేయి మరియు వారి సరఫరా/సామగ్రి విషయంలో నువ్వే మాకు చాలు.) ఎందుకంటే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క అసలు లక్ష్యం, దారి తప్పిన సృష్టి తమ సృష్టికర్త వైపుకు మళ్లడం. ఫలితంగా, అల్లాహ్ తఆలా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఈ ప్రార్థనను ఆ విధంగా అంగీకరించాడు, అదే తాయిఫ్ ప్రజలు సంవత్సరం కూడా గడవకముందే, హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలో రమజాన్ నెలలో, అందరూ ముస్లింలుగా మారిపోయారు.

**(షరఅ జర్కాని, అలల్ మవాహిబ్ లిద్దునియా సంపుటి 4, పేజి 15-18 దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1996)**

ఈ విషయం గురించి హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రదియల్లాహు అన్హు) కూడా ఒక చోట వివరించారు. ఆయన ఇలా అంటున్నారు: మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తాయిఫ్ వైపు బయలుదేరారు. ఏ పట్టణ వాసులు అయితే ఆయనపై రాళ్లు విసిరి, తమ పట్టణం నుండి బయటకు పంపారో, అదే పట్టణం వైపు వెళ్లారు. ఆయన ఆ పట్టణాన్ని కొంతకాలం ముట్టడించారు. అయితే, కొందరు వ్యక్తులు "వారిని ముట్టడించి సమయం వృథా చేయాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మొత్తం అరబ్ ప్రాంతంలో ఈ పట్టణం ఒక్కటే ఏమి చేయగలదు?" అని సలహా ఇచ్చిన తర్వాత, ఆయన ముట్టడిని విరమించుకుని తిరిగి వచ్చారు. ఆ తర్వాత కొంతకాలానికే, తాయిఫ్ ప్రజలు కూడా ముస్లింలు అయ్యారు.

**(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 20, పేజి 357)**

తాయెఫ్ నుండి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జు'రానాకు ఐదవ జుల్-ఖైదా రోజున వచ్చారు. అక్కడ యుద్ధంలో పట్టుబడిన ఖైదీలు మరియు యుద్ధ సొమ్ము అంతా పోగు చేయబడింది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాల మేరకు, ఆ ఖైదీల పట్ల అత్యంత దయతో వ్యవహరించబడింది. వారికి చలి, వేడి నుండి రక్షణ కల్పించడానికి తాత్కాలిక నివాసాలను కూడా నిర్మించారు. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పేజి 640, దారుల్ కుతుబుల్ ఇలల్మియత్ బీరూట్ 1993)(ఘజ్వా హునైన్ బాష్మీల్ పేజి 265, నఫీస్ అకాడమీ)**

యుద్ధ సొమ్ము వివరాలు ఈ విధంగా ఉన్నాయి: 6000 బానిసలు మరియు బానిసరాల్లు. వీరి కోసం నివాస ఏర్పాట్లు చేయడం జరిగింది. కొన్ని కథనాల్లో 8,000 అని కూడా ఉంది. నేటి యుద్ధాల మాదిరిగా కాదు. శత్రుత్వం వలన నివాసం లేకుండా చేస్తున్నారు. ఇళ్ళను కూల్చివేస్తున్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్‌లో ఇదే జరుగుతుంది. కాని ప్రవక్త (స) 6000ల నుండి 8000ల వరకు ఉన్నటు వంటి ఖైదీల కోసం నివాసాలను ఏర్పాటు చేశారు. ఒంటెలు 24,000, గొర్రెలు మరియు మేకలు 40,000 కంటే ఎక్కువ, వెండి 4,000 ఓకియా (ఇది దాదాపు 490 కిలోగ్రాములు) ముస్లింలకు ఇంత పెద్ద మొత్తంలో యుద్ధ సొమ్ము లభించడం ఇది మొదటిసారి. ఇటువంటి సందర్భంలో కూడా, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరుల శిక్షణ పట్ల చాలా శ్రద్ధ చూపారు. యుద్ధ సొమ్మును పంచడానికి ముందు, ఆయన ఈ విధంగా ప్రకటించారు: "ఈ సంపదలో, ఖుమ్స్ (ఐదవ వంతు) మినహా, నా హక్కు కూడా ఉంది. దానికి మీలో ప్రతి ఒక్కరూ అర్హులే. ఆ ఖుమ్స్ కూడా చివరికి మీకే తిరిగి వస్తుంది."

ఆ తర్వాత, ఆయన న్యాసం గురించి గట్టిగా నొక్కి చెప్పారు: "సూది, దాని దారం లేదా అంతకంటే చిన్న వస్తువు ఏదైనా ఎవరి దగ్గర ఉన్నా, వారు తిరిగి ఇచ్చేయండి. విశ్వాసఘాతానికి దూరంగా ఉండండి, ఎందుకంటే తీర్పు రోజున ఈ విశ్వాసఘాతం చేసేవారికి అపకీర్తికి, మచ్చకు కారణమవుతుంది." ఈ ప్రకటన విని, ఒక అనుచరుడు ఒంటె వెంట్రుకలతో చేసిన తాడు చుట్టను పట్టుకుని వచ్చి, "యా రసూలుల్లాహ్, పగిలిపోయిన రక్షక కవచాన్ని కుట్టడానికి నేను యుద్ధ సొమ్ములోంచి దారాన్ని తీసుకున్నాను" అని విన్నవించారు. మరొక అనుచరుడు యుద్ధ సొమ్ములోంచి ఒక సూది తీసుకుని తన భార్యకు ఇచ్చారు. ఈ ప్రకటన వినగానే, ఆయన వెంటనే తన భార్య వద్దకు వెళ్లి, ఆ సూదిని వెనక్కి తీసుకుని, యుద్ధ సొమ్ములో తిరిగి ఉంచారు. మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యుద్ధ సొమ్ము పంపిణీని మనుషులను ఆకర్షించడం)తో ప్రారంభించారు. ఈ పంపిణీ అరబ్బులలోని పెద్ద మనుషులకు మొదట చేశారు. వీరు తమ తెగలలో గౌరవం మరియు గొప్ప స్థానాన్ని కలిగి ఉన్నారు. వారిని తమతో కలిపేసుకోవడానికి వారికి బహుమతులు ఇచ్చారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిలో కొందరికి వంద ఒంటెలు ఇచ్చారు, మరికొందరికి యాభై ఒంటెలు ఇచ్చారు. వెండి మరియు బానిసలు దీనికి అదనంగా ఇవ్వబడెను.

ఒక ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకంలో వ్రాయబడిన దాని ప్రకారం, అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్కు వంద ఒంటెలు ఇవ్వబడ్డాయి. అబూ సుఫ్యాన్ పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సేవలో హాజరైనప్పుడు, ఆయన ముందు వెండి కుప్పలు పోసి ఉండటం చూసి, "యా రసూలుల్లాహ్! మీరు ఖురైష్‌లోనే అందరి కంటే ధనవంతులు అయ్యారు" అని అన్నారు. మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చిరునవ్వు నవ్వి, అబూ సుఫ్యాన్‌కు నలభై ఓకియా వెండి మరియు వంద ఒంటెలు ఇవ్వాలని ఆదేశించారు. అబూ సుఫ్యాన్ "నా కుమారుడు యజీద్కు కూడా దయచేయండి" అని అడిగారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికీ నలభై ఓకియా వెండి మరియు వంద ఒంటెలు ఇవ్వాలని ఆదేశించారు. (చరిత్రలో చెడ్డ పేరు పొందిన యజీద్ ఈ అబూ సుఫ్యాన్ మనవడు, అంటే హజ్రత్ ముఆవియా కుమారుడు). అబూ సుఫ్యాన్ తిరిగి "యా రసూలుల్లాహ్! నా మరొక కుమారుడు ముఆవియాకు కూడా ఏదైనా దయచేయండి" అని అడిగారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికీ నలభై ఓకియా వెండి మరియు వంద ఒంటెలు ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై అబూ సుఫ్యాన్ సంతోషంతో ఇలా అన్నారు: "నా తల్లిదండ్రులు మీపై త్యాగం చేయబడుదురు గాక! మీరు అత్యంత దయగలవారు. నేను మీతో యుద్ధాలు చేశాను, మరియు మీరు ఎంతటి మంచి యోధులో! ఆ తర్వాత నేను మీతో సంధి చేసుకున్నాను, మరియు మీరు ఎంతటి మంచి సంధి చేసుకునేవారో! అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలం ఇచ్చుగాక!"

**(షరఅ జర్కాని, అలల్ మవాహిబ్ లిద్దునియా సంపుటి 4, పేజి 18-19 దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1996)(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పేజి 396, దారుల్ కుతుబుల్ ఇలల్మియత్ బీరూట్ 1993)(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 289, బజమే ఇఖ్బాల్ లాహోర్)(ఘజ్వాయేహునైన్ బాష్మీల్ పేజి 217, 273-274 నఫీస్ అకాడమీ)**

మక్కా గౌరవనీయ మరియు ప్రముఖులలో హకీమ్ బిన్ హిజామ్ కూడా ఒకరు. మక్కా విజయం సమయంలో ఇతను ఇస్లాం స్వీకరించారు, మరియు హజ్రత్ ఖదీజా (రదియల్లాహు అన్హా) సోదరుడి కుమారుడు కూడా. ఆయన ఇంట్లోకి ప్రవేశించిన వారికి రక్షణ ఉంటుందని మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రకటించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇతనికి కూడా వంద ఒంటెలు దయచేశారు. హకీమ్ స్వయంగా ఇలా వివరించారు: "నేను మరో వంద అడిగాను, దానికి కూడా ఆయన దయచేశారు. నేను ఇంకో వంద అడిగాను, ఆయన నాకు మళ్లీ మరో వంద ఒంటెలు దయచేశారు." ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు: "ఓ హకీమ్, ఈ సంపద మంచిది మరియు తీపిగా ఉంటుంది. మంచి సంపద! ఎవరైతే దీన్ని మనస్సులో కోరిక లేకుండా తీసుకుంటారో, వారికి అందులో శుభం ఉంటుంది. కానీ ఎవరైతే దీన్ని మనస్సులోని లోభం మరియు ఆశతో తీసుకుంటారో, వారికి అందులో శుభం ఉండదు. వారు తింటున్నా, తృప్తి చెందని వ్యక్తి లాంటివారు. పై చేయి (ఇచ్చే చేయి), కింది చేయి (తీసుకునే చేయి) కంటే ఉత్తమమైనది."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉపదేశం ఎంతో ప్రభావాన్ని చూపింది: హకీమ్ అదే క్షణంలో విన్నవించుకున్నారు: "యా రసూలుల్లాహ్! మిమ్మల్ని సత్యంతో పంపిన వానిపై ప్రమాణం! నేటి నుండి చనిపోయే వరకు, నేను ఎవరినీ ఏమీ అడగను." కొన్ని కథనాల ప్రకారం, ఆయన అడిగిన రెండు వందల ఒంటెలను కూడా తిరిగి ఇచ్చేశారు. ఆ తర్వాత ఆయన తన ఈ ప్రమాణంపై జీవితాంతం నిలబడ్డారు మరియు ఎవరినీ ఏమీ అడగలేదు. దీనిని ఎంత కచ్చితంగా పాటించారంటే, హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రదియల్లాహు అన్హు) తన ఖిలాఫత్ కాలంలో వారికి ఏదైనా సంపద ఇవ్వడానికి పిలిచినప్పుడు, ఆయన తీసుకోవడానికి నిరాకరించారు. ఆ తర్వాత, హజ్రత్ ఉమర్ (రదియల్లాహు అన్హు) తన ఖిలాఫత్ కాలంలో, ఇస్లామి విజయాల ఫలితంగా వచ్చిన సంపద నుండి కొంత ఇవ్వడానికి పిలిచినప్పుడు కూడా హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ నిరాకరించారు. దీనిపై హజ్రత్ ఉమర్ అక్కడ హాజరైన వారందరితో ఇలా అన్నారు: "ప్రజలారా, సాక్ష్యంగా ఉండండి! నేను వీరికి వారి హక్కును ఇచ్చాను, కానీ వీరు తీసుకోవడానికి నిరాకరించారు." **(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 303-304, బజమే ఇఖ్బాల్ లాహోర్)(సీరతుల్ హలబియ్యా సంపుటి 3, పేజి 170, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2002)(అసాబ సంపుటి 2, పేజి 97, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1995)**

అపారమైన క్షమ మరియు దానం ద్వారా ప్రయోజనం పొందిన వారిలో మక్కా నాయకులలో ఒకరైన సఫ్వాన్ బిన్ ఉమయ్యా కూడా ఉన్నారు. సఫ్వాన్ బిన్ ఉమయ్యా ఎవరనగా, అతని నుండి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హునైన్ యుద్ధం కోసం కవచాలు మరియు ఆయుధాలు అప్పుగా తీసుకున్నారు. ఇతను బహుదైవారాధకుడిగా ఉండి కూడా హునైన్ యుద్ధంలో పాల్గొన్నాడు.

**(ఘజ్వాయేహునైన్ బాష్మీల్ పేజి 273 నఫీస్ అకాడమీ)(సబులూల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పేజి 316, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1993)(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 236, బజమే ఇఖ్బాల్ లాహోర్)**

కొన్ని కథనాల ప్రకారం, సఫ్వాన్ తన మనసులో "ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను చంపే అవకాశం లభిస్తే బాగుండు" లేదా "ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సైన్యాన్ని శత్రువు ఓడిస్తే బాగుండు" అని ఆలోచిస్తూ వచ్చాడు. **(సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 5, పేజి 321, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1993)** కానీ, అదే యుద్ధంలో అతని మనస్సు మారడం ప్రారంభమైంది. యుద్ధ సొమ్మును పంపిణీ చేసే సమయం వచ్చినప్పుడు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి వంద ఒంటెలు దయచేశారు. సహీహ్ ముస్లిం కథనం ప్రకారం, ఆయన స. అ. స. మూడు వందల ఒంటెలు దయచేశారు. మరొక కథనం ప్రకారం: ఆ రోజుల్లో, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక లోయ గుండా వెళ్లారు. ఆ లోయ యుద్ధ సొమ్ములోని ఒంటెలు మరియు గొర్రెలు/మేకలతో నిండి ఉంది. సఫ్వాన్ ఇంత పెద్ద మొత్తంలో సంపదను చూసి ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయాడు. మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అప్పుడు "ఓ అబూ వహబ్ (సఫ్వాన్ యొక్క బిరుదు)! ఈ లోయ నిన్ను ఆశ్చర్యపరిచిందా?" అని అడిగారు. అతను "అవును" అని అన్నాడు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఈ సంపద అంతా నీదే. నువ్వు తీసుకో." సఫ్వాన్ ఆశ్చర్యంతో, సంకోచం లేకుండా ఇలా అన్నాడు: "నేను సాక్ష్యమిస్తున్నాను, మీరు అల్లాహ్ ప్రవక్త అని!" (ఎందుకంటే ఇటువంటి దానం ఒక ప్రవక్త మాత్రమే చేయగలడు). మరొక కథనం ప్రకారం, సఫ్వాన్ బిన్ ఉమయ్యా స్వయంగా ఇలా వివరించారు: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాకు హునైన్ యుద్ధ సొమ్మును నిరంతరంగా ఇస్తూనే ఉన్నారు. దాని ఫలితం ఏమిటంటే, అంతకుముందు నాకు సమస్త సృష్టిలో అత్యంత అప్రియమైన వ్యక్తిగా ఉన్న మీరు, ఆ తర్వాత సమస్త సృష్టిలో అత్యంత ప్రియమైన వ్యక్తిగా మారారు." సారాంశం ఏమిటంటే, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా వివిధ అరబ్ నాయకులకు దానం చేస్తూ వచ్చారు. వారి సంఖ్య యాభైకి పైగా చెప్పబడింది. **(సహీ ముస్లిం కితాబుల్ ఫజాయిల్ బాబ్ ఫీ సఖార కథనము 2313)(షరఅ జర్కాని అలల్ మవాహిబ్,లిద్దునియా సంపుటి 4, పేజి 21 దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1996)(సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 5, పేజి 396, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1993)**

ఆ తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రదియల్లాహు అన్హు)ను మిగిలిన ప్రజలను పిలవమని ఆదేశించారు మరియు వారిలో యుద్ధ సొమ్మును పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరి వాటాకు నాలుగు ఒంటెలు లేదా నలభై గొర్రెలు వచ్చాయి. ఈ విధంగా, అప్పటివరకు లభించిన అత్యంత పెద్ద మొత్తంలో ఉన్న యుద్ధ సొమ్మును ఆయన పూర్తిగా ప్రజలలో పంపిణీ చేశారు.

**(షరఅ జర్కాని అలల్ మవాహిబ్,లిద్దునియా సంపుటి 4, పేజి 27 దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1996)(ఘజ్వాయేహునైన్ బాష్మీల్ పేజి 270 నఫీస్ అకాడమీ) (దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 9, పేజి 289, 323 బజమే ఇఖ్బాల్ లాహోర్)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్రలోని ఈ కోణం గమనించదగినది: ముస్లింలు పేదవారు మరియు సంపద లేనివారు కాబట్టి యుద్ధాలు ప్రారంభించారని ప్రత్యర్థులు ఆయనపై మరియు ఆయన యుద్ధాలపై ఆరోపణలు చేస్తారు. ఈ ఆరోపణలో కొద్దిపాటి నిజం ఉన్నా, హునైన్ యుద్ధ సొమ్ము పంపిణీ వేరే విధంగా ఉండేది. కానీ ఇక్కడ మనం చూస్తున్నదేమిటంటే: యుద్ధ సొమ్ములో భారీ భాగం హృదయాలను ఆకర్షించడానికి ఇతరులకు ఇవ్వబడింది.

**(సీరతున్నబీ (స) షబ్లీ నూఅమాని భాగం 1, పేజి 396, భాగం 4, పేజి 247, మక్తబ ఇస్లామీయ 2012)**

ఖురైష్ నాయకులకు దానం చేయబడింది. కొన్ని కథనాల ప్రకారం, మొత్తం సంపద దాదాపుగా ఇతరులలోనే పంపిణీ చేయబడింది. దీని వెనుక ఏ ఉద్దేశాలు ఉన్నప్పటికీ, మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కోసం ఏమీ ఉంచుకోలేదని ప్రపంచం చూసింది. అంతేకాకుండా, దీనికి సంబంధించిన వివరాలు తర్వాత వస్తాయి, కానీ తన నమ్మకమైన మరియు విశ్వసనీయ అనుచరులైన అన్సార్-ఎ-మదీనాకు కూడా ఈ యుద్ధ సొమ్ములో ఏమీ ఇవ్వలేదు. పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఖురైష్ ప్రజలకు సంపదను ఇవ్వడానికి గల ఒక కారణాన్ని వివరిస్తూ ఇలా అన్నారు: "ఇన్నీ ఉఅతీ ఖురైశన్ అతఅల్లఫహుం లి అన్నహుమ్ హదీసు అహదిన్ బి జాహిలియ్యతిన్" (నేను ఖురైష్ వారికి ఇచ్చి వారి హృదయాలను ఆకర్షిస్తున్నాను, ఎందుకంటే వారికి అవిశ్వాసంతో సంబంధాలు తెంచుకుని ఎక్కువ కాలం కాలేదు. వారి విశ్వాసం ఇంకా అంతగా బలపడలేదు.

**(సహీ బుఖారి కితాబుల్ ఫరజుల్ ఖమ్సు, బాబ్ మా కాన న్నబియ్యు సల్లల్లాహు అలైహి వసల్లం యుఉతీల్ ముఅల్లఫత ఖులూబుహుం హదీస్ 3146)**

సహీహ్ బుఖారీలోని మరొక కథనం ప్రకారం, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఇన్న ఖురైశన్ హదీసు అహదిన్ బిజాహిలియ్యతి వ ముసీబతిన్, వ ఇన్నీ అరద్తు అన్ అజ్‌బురహుమ్ వ అత'అల్లఫహుమ్" **(సహీ బుఖారి, కితాబుల్ మఘాజీ, బాబ్: ఘజ్వతుల్ తాయిఫ్ 4334)** ఖురైష్ యొక్క అవిశ్వాసం, వినాశనం మరియు నాశనం యొక్క కాలం ఇప్పుడే గడిచింది. నా ఉద్దేశం ఏమిటంటే, వారి నష్టాన్ని భర్తీ చేయడం మరియు వారిని అనునయించడం.) ఈ జ్ఞానయుక్తమైన పంపిణీ మరియు దయ వలన అద్భుతమైన మరియు శుభకరమైన ప్రభావాలు కనిపించాయి: ఒకప్పుడు ఆయన రక్తం కోసం దాహం తీర్చుకోవాలని చూసిన వారు, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఉత్తమమైన మరియు ప్రియమైన వ్యక్తిగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను భావించారు. ఇస్లామును అంతం చేయడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టిన వారే, ఇప్పుడు ఇస్లాం మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రక్షణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధమయ్యారు. వారిలో చాలా మంది తర్వాత ఇస్లామి యుద్ధాలలో అమరత్వం స్థానాన్ని పొందారు మరియు వారి ఇస్లాం ఉత్తమ ఇస్లాంగా నిరూపించబడింది.

**(దాయిరే మాఅరుఫ్ సీరత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 298-299, బజమే ఇఖ్బాల్ లాహోర్ )**

ఈ సందర్భంలో, కొందరు కపటులు యుద్ధ సొమ్ము పంపిణీపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అమర్యాద మరియు అగౌరవాన్ని ప్రదర్శించారు. వారు, నఊజుబిల్లాహ్ (అల్లాహ్ మమ్మల్ని రక్షించుగాక), మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) న్యాయం మరియు ధర్మంతో పనిచేయలేదని మరియు దేవుని సంకల్పం ప్రకారం పనిచేయలేదని నింద మోపారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విషయం విన్నప్పుడు, ఆయన పవిత్ర ముఖం ఎర్రబడింది మరియు ఆయన ఇలా అన్నారు: "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా న్యాయంగా వ్యవహరించకపోతే, ఇంకెవరు న్యాయం చేయగలరు?".

ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు: "అల్లాహ్ నా సోదరుడు మూసాపై దయ చూపుగాక! ఆయనకు దీనికంటే పెద్ద కష్టాలు మరియు బాధలు కలిగించబడ్డాయి, కానీ ఆయన సహనంతో వ్యవహరించారు." అదే విధంగా, ధుల్-ఖువైసరా అనే మరొక వ్యక్తి మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముందు నిలబడి ఇలా అన్నాడు: "ఓ ముహమ్మద్! ఈరోజు మీరు చేసిన దాన్ని నేను చూశాను." పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "సరే, నువ్వు ఏమి చూశావు?" అని అడిగారు. అతను "మీరు న్యాయంగా వ్యవహరించలేదు" అని అన్నాడు. దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "నీకు చెడు జరుగుగాక! నా వద్దే న్యాయం లేకపోతే, ఇంకెవరి వద్ద ఉంటుంది?" దీంతో, హజ్రత్ ఉమర్ మరియు హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రదియల్లాహు అన్హుమ్) లేచి నిలబడి, "అనుమతి ఇస్తే, మేము ఇతని శిరచ్ఛేదం చేస్తాము" అని విన్నవించారు.

మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "వద్దు" అని అన్నారు. "బహుశా ఈ వ్యక్తి నమాజ్ చేస్తాడేమో." "ఇది కూడా నిశ్చయమైన విషయం కాదు, కానీ బహుశా ఈ వ్యక్తి నమాజ్ చేస్తాడేమో అనే ఈ అనుమానం కారణంగా, అతని శిరచ్ఛేదం చేయమని నేను ఎలా చెప్పగలను?" (ఈ రోజుల్లోని ముస్లింల చర్యలు ఎలా ఉన్నాయో చూడండి.) దానికి హజ్రత్ ఖాలిద్ (రదియల్లాహు అన్హు) విన్నవించుకున్నారు: "ఒక నమాజ్ చేసే వ్యక్తి కూడా తన హృదయంలో లేని మాటను చెప్పగలడా? దైవ " ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఖాలిద్, ప్రజల హృదయాలను చీల్చి లేదా వారి ఛాతీలను చీల్చి చూడమని నాకు ఆజ్ఞాపించబడలేదు."

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంకా ఇలా అన్నారు: "ఈ వ్యక్తి మరియు అతని సహచరులు ఖురాన్‌ను చదువుతారు, కానీ అది వారి గొంతుకల క్రిందికి దిగదు (అర్థం చేసుకోరు). వారి విశ్వాసం ఉపరితలంగా (తేలికగా) ఉంటుంది. మరియు బాణం వేట జంతువు నుండి ఆ విధంగా దూసుక వెళ్ళినట్లుగా, వారు ధర్మం నుండి బయటకు వెళ్లిపోతారు. దానిపై రక్తపు ఆనవాళ్లు కూడా ఉండవు. మీరు వారి నమాజ్ మరియు ఉపవాసాల ముందు మీ నమాజ్ మరియు ఉపవాసాలను తక్కువగా భావిస్తారు. (అంటే, వారు పైకి ఎక్కువ మరియు క్రమ బద్ధమైన నమాజ్ చేస్తారు మరియు ఉపవాసం పాటించడంలో కఠినంగా ఉంటారు.)"

**(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 5, పేజి 404-405, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 1993)(సీరతుల్ హలబియ్య సంపుటి 3, పేజి 173-174, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ 2002)**

ఈ రోజుల్లో చాలా మంది ముస్లింల, ముఖ్యంగా ఉలమాలు (పండితులు) అని పిలవబడే వారి చర్యలు ఇలాగే ఉన్నట్లు మనం చూస్తున్నాము. దీని గురించి ఆయన ముందే ప్రవచించారు. వ్యాఖ్యాతలు (షారిహీన్) వివరిస్తూ: ఈ వ్యక్తే ఖవారిజ్ తిరుగుబాటు స్థాపకులలో ఒకడు అయ్యాడు. హజ్రత్ అలీ (రదియల్లాహు అన్హు) కాలంలో ఈ సమూహం ముందుకు వచ్చింది, మరియు హజ్రత్ అలీ వారితో జిహాద్ చేశారు. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి గురించి ఏ విధంగా అయితే వర్ణించారో, సరిగ్గా వారు అదే విధంగా బయటపడ్డారు. **(ఉమ్దతుల్ ఖారి, సంపుటి 15, పేజి 345, దారుల్ హయాత్తారాసు 2003)(ఇర్షాద్ సారి షరహ్ సహి బుఖారి, సంపుటి 6, పేజి 159, దారుల్ ఫికర్ 2010)**

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రదియల్లాహు అన్హు) ఈ విషయంలో ఒక చోట ఇలా వివరించారు: ధుల్-ఖువైసరా అనే వ్యక్తి రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, "ఓ ముహమ్మద్! మీరు ఈ రోజు చేసినదంతా నేను చూశాను" అని అన్నాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) "నువ్వు ఏమి చూశావు?" అని అడిగారు. అతను "మీరు ఈ రోజు అన్యాయం చేశారని మరియు న్యాయంగా వ్యవహరించలేదని నేను చూశాను" అని అన్నాడు (నఊజుబిల్లాహ్). ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) "మీకు విచారకరం! నేనే న్యాయం చేయకపోతే, ప్రపంచంలో ఇంకే మానవుడు న్యాయం చేస్తాడు?" అని అన్నారు. ఆ సమయంలో సహాబీలు కోపంతో లేచి నిలబడ్డారు. ఈ వ్యక్తి మస్జిద్ నుండి లేచి వెళ్ళిపోయినప్పుడు, వారిలో కొందరు, "యా రసూలుల్లాహ్! ఈ వ్యక్తిని చంపాలి. ఇతన్ని చంపడానికి మీరు అనుమతి ఇస్తారా?" అని అడిగారు. (ఈ రోజుల్లో దైవదూషణ (తౌహీన్-ఎ-రిసాలత్) గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతారు, దాన్ని ఇక్కడ కూడా గమనించండి.) .

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఈ వ్యక్తి చట్టాలను పాటిస్తే, మనం అతన్ని ఎలా చంపగలం?" (అంటే, మన నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటే, అతన్ని చంపాల్సిన అవసరం లేదు.)

సహాబీలు విన్నవించారు: "యా రసూలుల్లాహ్! ఒక వ్యక్తి పైకి ఒకటి ప్రదర్శిస్తూ, మనసులో మరొకటి పెట్టుకుంటే, అలాంటి వ్యక్తి శిక్షకు అర్హుడు కాదా?" రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ప్రజల హృదయాల్లోని ఆలోచనల ప్రకారం వారితో వ్యవహరించమని దేవుడు నాకు ఆజ్ఞాపించలేదు. ప్రజలతో వారి బాహ్య ప్రవర్తన ప్రకారం వ్యవహరించమని మాత్రమే నాకు ఆజ్ఞాపించబడింది."ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు: "ఈ వ్యక్తి మరియు అతని సహచరులు ఒక రోజు ఇస్లాంకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తారు."

(ఆయన ఉద్దేశం: "ఇప్పుడు నేను అతనికి శిక్ష విధించడం లేదు, కానీ వారు తిరుగుబాటు చేస్తే, దానికి తగిన ఫలితం అనుభవిస్తారు.") నిజానికి, హజ్రత్ అలీ (రదియల్లాహు అన్హు) కాలంలో, ఈ వ్యక్తే మరియు అతని తెగ ప్రజలు తిరుగుబాటుదారులకు నాయకత్వం వహించారు. వీరు హజ్రత్ అలీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, నేటికీ ఖవారిజ్ పేరుతో ప్రసిద్ధి చెందారు.

మిగిలిన వివరాలు ఇన్షా అల్లాహ్, తరువాత తెలియజేయబడును.

❖❖❖

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

**(2వ పేజి తరువాత)**

కావున అక్కడ ప్రస్తావించబడుతున్న విషయాలు పాకిస్తాన్ ప్రజల కొరకు లేదా యూరప్‌కు చెందిన కొంతమంది ప్రజల కొరకే కాదని ప్రతి దేశంలో ఉన్నటు వంటి కొన్ని సాంప్రదాయాలను, వివిద దేశాల ప్రజలలో పోలి ఉన్నటు వంటి కొన్ని అలవాట్లను ఈ ప్రసంగాల ద్వార ప్రజలు తమను తాము సంస్కరించుకుంటు న్నారనే వారి లేఖల ద్వార నాకు తెలుస్తుంది. ప్రస్తుతం నేను ఇస్లామీయ చరిత్రపై ప్రసంగిస్తున్నాను. ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను గూర్చి ప్రసంగిస్తున్నాను. వీటిలోని అనేక విషయాలు మన సంస్కరణకు దొహదపడుతాయి. వీటి ద్వార ప్రజలకు చాలా ప్రయోజనం చేకూరుతుంది.

ఈ ఖిలాఫత్ ద్వారనే అల్లాహ్ తాలా మనలో ఈ స్థితిని నెలకొల్పినాడు. దీని ద్వారనే అహ్మదియ్య జమాఅత్‌లో ఐక్యత ఏర్పడింది. ప్రపంచంలోని 215 దేశాలలో ఉన్నటు వంటి అహ్మదీయులందరు ఒకే త్రాటిపై ఏకమై ఈ వ్యవస్థతో ముడిపడి యున్నారు. తమను తాము సంస్కరించుకుంటున్నారు. "

**(జుమా ప్రసంగం 30 మే 2025)**

శ్రోతలారా! ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం వైపు శ్రద్ధ కల్పించడం కూడ చాలా అవసరమని భావిస్తున్నాను. పరలోక జీవితానికి అరుదైన బహుమతి స్వర్గం అని చెబుతుంటారు. అట్టి స్వర్గానికి ప్రపంచంలో ప్రతీక " ఖిలాఫత్ వ్యవస్థ" అని చెప్పుకోవడం జరుగుతుంది. అన్నిటి కంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటనగా, ఈ రెండింటిని పొందుటకు కావలసిన అర్హత " సత్కార్యములను ఆచరించడం" ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఈ విధముగా తెలిపాడు. **వబష్షిరిల్లజీన ఆమనూ వ ఆమిలుస్సాలిహాతి అన్నలహుం జన్నాతిన్ తజ్‌రీ మిన్ తహ్‌తిహల్ అన్‌హార్** (బఖర:26) అదే విధముగా ఖిలాఫత్‌ను సూచించు సూక్తిలో కూడ ఈ విధముగానే ఉన్నది. అనగా, **వఅదల్లాహుల్లజీన ఆమనూ మిన్‌కుం వ ఆమిలుస్సాలిహాతి లయస్తఖ్‌లిఫన్నహుం ఫిల్ అర్‌జి** (అన్నూర్:56) ఈ రెండు సందర్భాలలో కూడ విశ్వాసంతో పాటు సత్కార్యములను ఆచరించుటనే నిబంధనగా పేర్కొనడం జరిగింది. మన కార్యాచరణలు ఎప్పుడు సత్కార్యములుగా పరిగణించబడుతాయి అనే విషయాన్ని కూడ మనం హుజూర్ అన్వర్ గారి ఉపదేశాలలోనే విన్నాము. " వర్తమాన ఖలీఫా అందరి దృష్టిని ఒకేవైపు కేందీకృతం చేస్తాడు. " అనగా ఎప్పుడు ఏ పని చేయాలి?, ఎప్పుడు ఏ పని చేయకూడదు? అనే విషయాన్ని మనకు తెల్పుతుంటాడు. నిజం చెప్పాలంటే వర్తమాన ఖలీఫా ఏ పనినైతే చేయమని ఆదేశిస్తారో అదే సత్కార్యము అనబడుతుంది. అందుకు భిన్నముగా చేయునట్టి ఏ పని కూడ సత్కార్యము అనబడదు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హ్ ఈ విషయాన్నే ఈ విధముగా తెలియజేశారు. " మీరందరు ఇమాం సూచనల మేరకు నడుచుకోండి. వారి సూచనల నుండి ఏ మాత్రం అటు ఇటు కాకూడదు. వారు ఆదేశించినప్పుడు కదలండి, వారు ఆదేశించినప్పుడు ఆగండి. ఏ దిశకు సూచించినచో ఆ దిశకు వెళ్ళండి. ఏ దిశకు నిలువరించెదరో అట్టి దిశ నుండి దూరంగా ఉండండి. "

**(అన్వారుల్ ఉలూమ్, సంపుటి 14, పేజి 515-516)**

శ్రోతలారా! ఖలీఫాల ఆదేశాలను, సూచనలను ఎంత శ్రద్ధతో వినాలి, ఎంత జాగ్రతగా ఆచరించాలి అనే ప్రధానమైన విషయాన్ని గూర్చి మనం తెలుసు కున్నాము. కాని ఆయా ఆదేశాలను స్వయముగా ఖలీఫతుల్ మసీహ్ నుండి వినడం ఎంత ముఖ్యమో?, ఎంతటి ప్రభావాన్ని కల్గియుంటాయో? తెల్పుచూ హజ్రత్ ఖలీఫతుల్ మసీహురాబేహ్ రహ్మ గారు ఇలా తెలిపారు." నా అనుభవంతో తెల్పుచున్నాను. స్వయముగా ఖలీఫా నుండి సందేశాన్ని వినడం వలన కలిగే పరివర్తన ప్రభావం, వర్తమాన ఖలీఫా తరుపున ఇతరులు అందించే సందేశం వలన కలుగదు. నేను ఇతర ఖలీఫాల సాన్నిహిత్యంలో ఉంటూ, వారి ఆదేశాలకు అనుగుణముగా, నా జీవితపు అధికభాగాన్ని గడుపుటకు ప్రయత్నిస్తూ వచ్చాను. ఫలాన జుమా ప్రసంగంలో ఖలీఫా గారు ఫలాన విషయాన్ని ప్రస్తావించారు మరియు నేను అట్టి ప్రసంగాన్ని స్వయముగా విన్నాను అని తెలుపే రెండు విషయాలు భూమికి ఆకాశానికి ఉన్నంత వ్యత్యాసముగా ఉంటాయని నాకు తెలుసు." **(జుమా ప్రసంగం 8 జనవరి 1993)**

మొత్తానికి వర్తమాన ఖలీఫా గారి ఉపదేశాలు విశ్వాసుల ప్రాణాన్ని పోలి ఉంటాయి. వాటిని వినడం, అందుకు అనుగుణముగా నడుచుకోవడమే వారి జీవిత లక్ష్యమవుతుంది. తద్వార వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. ఇందుకోసమే హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మన భారతీయ అహ్మదీయుల కోసం నాలుగు సూచనలు గల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వాటిలో ఒకటి మనం క్రమం తప్పకుండా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా గారి ప్రసంగాలను స్వయముగా వినాలి. మన పిల్లలు కూడ వినేలా అలవాటు చేయాలి. హుజూర్ అన్వర్ గారి జుమా ప్రసంగాలు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఉపదేశాలకు అనుగుణముగా ఉంటాయి. అనగా " ఈ పాలు అల్లాహ్ తాలా ఆకాశం నుండి క్రిందికి దించాడు. " అల్ హందులిల్లాహ్, ప్రతిజుమా ప్రసంగం విశ్వాసుల ఇంటికి చేరుతుంది. దీనిని గూర్చి హుజూర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు:

" నా జుమా ప్రసంగాలను, ఇతర కార్యక్రమాలను తప్పకుండా వినండి. నేను సమీక్షించి చూడగా తెలిసినదేమనగా, కొంత మంది పదవి దారులు కూడ నా ప్రసంగాలను క్రమబద్ధముగా వినడం లేదు..... మిమ్ములను మీరు తప్పకుండా ప్రసంగాలు వినేటట్లుగా చేసుకోండి. ఫలితముగా ప్రపంచ నలు మూలల వరకు అహ్మదియ్య బోధనలు వ్యాపించగలవు. "

**(జుమా ప్రసంగం, 27 అక్టోబర్ 2013)**

# జుమా ప్రసంగము

"ఓ అన్సార్! నా తర్వాత మీరు మీపై ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని చూస్తారు, కానీ మీరు సహనం వహించండి, అప్పుడు హౌజ్-ఎ-కౌసర్ (కౌసర్ జలాశయం) వద్ద మీరు నన్ను కలుసుకుంటారు," అంటే, ప్రళయ దినాన కలుసుకుంటారు మరియు మీకు నాయకత్వం లభించదు. చివరకు, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్ కొరకు ప్రార్థన చేస్తూ ఇట్లు అన్నారు: "ఓ అల్లాహ్! అన్సార్ పై దయ చూపు, అన్సార్ల సంతానంపై దయ చూపు మరియు అన్సార్ల తరువాతి తరాలపై కూడా దయ చూపు."

---

ఆ వ్యక్తులు, ఎవరైతే పదవి పొందడానికి లేదా సంపద మొదలైన వాటిని పొందడానికి త్యాగం చేస్తున్నారో, వారు నా పిలుపుపై (అంటే, వర్తమాన ఉత్తరాధికారి పిలుపుపై) త్యాగం చేయడానికి అస్సలు రాకూడదు." "బదులుగా, దైవం కొరకు త్యాగం చేసే ప్రజలు మాత్రమే రావాలి. ఎందుకంటే నేను స్వయంగా బలహీనమైన, అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని. నేను ఎవరి ఉపకారాన్ని మోయలేను." "కావున, నేను నా కొరకు అడగడం లేదు. ఎవరైతే అల్లాహ్ తఆలా కొరకు ఇస్తున్నారో, వారు ఇవ్వాలి. అల్లాహ్ తఆలా దాని ప్రతిఫలాన్ని కూడా ఇస్తాడు.

---

ఒక వ్యక్తి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరైనప్పుడు అతడు రెండు కొండల మధ్య ఒక లోయలో ఉన్న గొర్రెల పెద్ద మందను చూశాడు. అతను వారి సల్లల్లాహు అలైహి వసల్లంతో 'దీనిని నాకు ఇచ్చేయండి,' అని అడిగాడు. మహాప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా దానిని అతనికి ఇచ్చేశారు." "ఆ మందను తీసుకుని, అతను తన జాతి ప్రజల వద్దకు వెళ్లి ఇట్లన్నాడు: 'ఓ ప్రజలారా! ముహమ్మద్ (స: అ: వ:) పై విశ్వాసం ప్రకటించండి. ఆయన ఎంతగా ఇస్తారంటే, ఆయనకు పేదరికం, ఆకలితో భయం అస్సలు ఉండదు.'

---

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ క్రీ.శ 26 సెప్టెంబర్ 2025, ( 26 తబూఖ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

గత ఖుత్బాలో హునైన్ యుద్ధ సంపద పంపిణీ గురించి ప్రస్తావించబడింది. దీని గురించి మరిన్ని వివరాలు కూడా ఉన్నాయి. గతంలో వివరించినట్లుగా, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధ సంపదను పంచి, యుద్ధ వీరులకు వారి వాటాలు కూడా ప్రసాదించారు. అయితే, (యుద్ధ సంపదలో నుండి) ఐదవ భాగం (ఖుమ్స్) దాదాపు మొత్తం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ముఅల్లఫతుల్ ఖుబూబ్ (మనస్సులు ఆకర్షించబడిన వారు) కోసం ఖురైష్ నాయకులకు మరియు ఇతర అరబ్ నాయకులకు పంచిపెట్టారు. ఒకరికి వంద ఒంటెలు, మరొకరికి యాభై ఒంటెలు ఇచ్చారు. ఇంత ఎక్కువగా ఇతరులకు ధనం ఇవ్వబడటంతో, అన్సార్లలోని కొందరు యువకులు దానిని గమనించి, తమ సేవలు మరియు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై తమకున్న ప్రేమ కారణంగా తాము ఇతరుల కంటే అధిక అర్హులమని భావించారు. అందువల్ల వారు ఇట్లు అనడం ప్రారంభించారు: **"యగ్ఫిరుల్లాహు లిరసూలిల్లాహి సల్లల్లాహు అలైహి వసల్లం యు'తీ ఖురైషన్ వ యదఉనా వ సుయూఫునా తఖ్తురు మిన్ దిమాయిహిమ్"** అనగా అల్లాహ్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు క్షమాభిక్ష ప్రసాదించుగాక, వారు ఖురైష్‌లకు ఇస్తున్నారు, మమ్మల్ని విడిచిపెడుతున్నారు. వాస్తవానికి, మా కత్తులలో నుండి ఆ శత్రువుల రక్తం టపటపా కారుతోంది. ఈ భావన వారి మనస్సులో కలిగింది.

**(బుఖారి కితాబుల్ ఫరజుల్ ఖుమ్స్ బాబ్ మా కానన్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం యుఅతిల్ ముఅల్లఫతు ఖులూబిహిం హదీస్ 3147)(సుబులుల్ హుదా వర్రిషాద్ సంపుటి 5, పేజి 396, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్, 1993)(దాయిరే మాఅరుఫ్ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 290, బజమే ఇక్బాల్ లాహోర్)**

అదేవిధంగా, వారిలో కొందరు ఇట్లు కూడా అన్నారు: "పరిస్థితులు కఠినంగా, ప్రతికూలంగా ఉన్నప్పుడు మమ్మల్ని పిలవబడుతుంది, కానీ యుద్ధ సంపద మాత్రం మమ్మల్ని కాదని ఇతరులకు ఇవ్వ బడుతుంది." **(సహి ఇబ్నే హబ్బాన్, కితాబు స్సిర్ బాబ్ జికర్ మా యస్తహబ్బు లిల్ ఇమాఆమ అన్ యద్ఊ అన్సార పేజి 1287 హదీస్ 4769, దారుల్ మఅరుఫాఆ బీరూట్ 2004)**

ఈ విషయాలు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియగానే, ఆయన అన్సార్ల నాయకుడైన హజ్రత్ సఅద్ బిన్ ఉబాద: (ర: అ:) ను పిలిచారు. కొందరి అభిప్రాయం ప్రకారం, ఈ విషయాలన్నీ చెప్పినవారు కూడా హజ్రత్ సఅద్ (ర: అ:) యే. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆయనను ఇట్లు అడిగారు: **"ఫ ఐన అన్త మిన్ జాలిక యా సఅద్?"** (ఓ సఅద్! దీని గురించి నీ అభిప్రాయం ఏమిటి?) దానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంకు ఇట్లు మనవి చేశారు: "యా రసూలల్లాహ్ (స: అ: వ:)! నేను కూడా నా జాతిలో ఒక సభ్యుడినే. ఈ విషయం నాపై కూడా ప్రభావం చూపవచ్చు." దానిపై మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సఅద్ (ర: అ:) తో, "అన్సార్లందరినీ ఒకచోట పోగు చేయండి" అని ఆదేశించారు. తదనుగుణంగా, వారంతా ఒక గుడారంలో సమావేశమయ్యారు. కొందరు వలసదారులు కూడా ఆ గుంపులో చేరారు. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం "నేను కేవలం అన్సార్లను మాత్రమే పిలిచాను" అని చెప్పి, వలసదారులను అక్కడి నుండి తిరిగి పంపించారు. తరువాత, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్లను ఉద్దేశించి ఇట్లు ఉపదేశించారు: "ఓ అన్సార్ల సమూహమా! మీ వైపు నుండి నాకు చేరిన ఆ మాట ఏమిటి?" మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రశ్నకు అన్సార్లలోని పెద్దలు ఇట్లన్నారు: "యా రసూలల్లాహ్ (స: అ: వ:)! మాలోని తెలివైన వారు ఎవరూ అటువంటి మాట మాట్లాడలేదు. అయితే, కొంతమంది ఉద్వేగపూరిత యువకులు ఇట్లన్నారు: 'అల్లాహ్ ప్రవక్త (స: అ: వ:) కు క్షమాభిక్ష ప్రసాదించుగాక! వారు ఖురైష్‌లకు ఇస్తున్నారు, కానీ వారు మమ్మల్ని తమ అనుగ్రహం నుండి దూరం చేస్తున్నారు. అయినప్పటికీ, మా కత్తుల నుండి ఆ శత్రువుల రక్తం టపటపా కారుతుంది." మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్లపై అల్లాహ్ చేసిన ఉపకారాలు, అనుగ్రహాలను ప్రస్తావిస్తూ వారిని ఉద్దేశించి ఇట్లన్నారు: "ఓ అన్సార్లారా! నేను మిమ్మల్ని కలిసినప్పుడు నేను మిమ్ములను దారి తప్పిన వారిగా పొందలేదా? అప్పుడు అల్లాహ్ నా ద్వారా మీకు మార్గదర్శకత్వం ప్రసాదించాడు. మీరు చెల్లాచెదురైన, విడిపోయిన జాతిగా ఉండి, ఒకరికొకరు శత్రువులుగా ఉండేవారు. అల్లాహ్ నా ద్వారా మీ మధ్య పరస్పర ఆప్యాయత, ప్రేమను సృష్టించాడు. మీరు నిరుపేదలు, అవసరంలో ఉండేవారు. అల్లాహ్ నా కారణం చేత మిమ్మల్ని సంపన్నులు గా, ధనవంతులుగా చేశాడు." మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విషయం మాట్లాడినా, అన్సార్లు దానికి **"అల్లాహు వ రసూలుహు ఆమన్ను"** (ఇదంతా అల్లాహ్, ఆయన ప్రవక్త యొక్క ఉపకారమే) అని సమాధానమిచ్చేవారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్ల నుండి ఈ సమాధానం విని, "మీరు నాకు ఎందుకు జవాబు ఇవ్వడం లేదు?" అని అడిగారు. వారు, "యా రసూలల్లాహ్ (స: అ: వ:)! మేము ఏమి సమాధానం ఇవ్వగలం?" అని అన్నారు. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: "మీరు కావాలనుకుంటే నాకు ఈ సమాధానం ఇవ్వవచ్చు, మీరు సత్యమే చెబుతున్నట్లవుతుంది, మీ మాట ధృవీకరించబడుతుంది. మీరు ఇలా అనవచ్చు: 'యా రసూలల్లాహ్ (స: అ: వ:)! మీరు మా వద్దకు వచ్చినప్పుడు మిమ్మల్ని అబద్ధీకుడుగా భావించారు, మీ మాటను నిరాకరించారు. కానీ మేము మిమ్మల్ని విశ్వసించాం. మీరు నిస్సహాయంగా ఉన్నారు, ప్రజలు మిమ్మల్ని పట్టించుకోలేదు, కానీ మేము మీకు సహాయం చేశాం. ఆ ప్రజలు మిమ్మల్ని తమ నగరం నుండి బహిష్కరించారు, కానీ మేము మీకు ఆశ్రయం ఇచ్చాం. మీరు అనేక మంది కుటుంబ సభ్యులతో ఉండేవారు, మేము మీకు అండగా నిలిచాం'." మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నోట ఈ మాట వినగానే ఏ ఒక్క అన్సారీ మాట్లాడలేకపోయెను. వారంతా తలలు దించుకొని ఆయన మాటలు వింటూ పశ్చాత్తాప పడుతుండిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తాను ఖురైష్ వారితో ఎందుకు ఈ విధంగా వ్యవహరించారు అనే విషయాన్ని కూడా అన్సార్లకు వివరించారు. ఆయన ఇట్లన్నారు: "మీరు (అన్సార్లు) అయితే ముందుగానే ఇస్లాంను అంగీకరించారు, ఇస్లాం, విశ్వాసం మీ హృదయాలలో బాగా స్థిరపడింది. కానీ ఖురైష్‌లలోని చాలా మంది మక్కా విజయ సమయాన కొత్తగా ముస్లింలయ్యారు. అంతేకాక, కొందరు ఇప్పటికీ ఇస్లాంతో పూర్తిగా అనుబంధం కలిగిలేరు. అందువలన, పాత విశ్వాసుల కంటే ఈ నూతన ముస్లింలు దయ, అనుగ్రహానికి ఎక్కువ అర్హులుగా ఉన్నారు, తద్వారా ఇస్లాం వారి హృదయాలలో స్థిరపడగలదు. అనేక యుద్ధాలలో ఖురైష్ తమ ఆస్తిపాస్తులను చాలా కోల్పోయారు, కాబట్టి వారిని ఓదార్చడం, వారు పూర్తిగా ఇస్లాం, విశ్వాసం పరిధిలోకి వచ్చేలా చేయడమే నా ఉద్దేశమై ఉండెను."

తరువాత, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: "ప్రజలు గొర్రెలు, ఒంటెలను తీసుకొని తమ ఇళ్లకు వెళ్లగా, మీరు అల్లాహ్ ప్రవక్తను మీతో పాటు తీసుకుపోవడాన్ని మీరు ఇష్టపడరా? అల్లాహ్ మీద ప్రమాణం! మీరు తీసుకుపోతున్న ఈ అదృష్టం, వారు తీసుకుపోతున్న దానికంటే చాలా గొప్పది."

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: "ప్రజలు ఏదైనా లోయలో లేదా ఘాటీలో నడిచినా, అన్సార్ ఏదైనా లోయలో లేదా ఘాటీలో నడిచినా, నేను కూడా అన్సార్ తో నడవడానికి ఇష్టపడతాను." అంటే, నేను అన్సార్ల సమూహంలో చేరతాను. "ప్రజలు నా బాహ్య వస్త్రం, అయితే అన్సార్లు నా అంతర్గత వస్త్రం వంటివారు (అంటే, శరీరానికి అతుక్కొని ఉండే బట్ట).

మరల మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. "ఓ అన్సార్! నా తర్వాత మీరు మీపై ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని చూస్తారు, కానీ మీరు సహనం వహించండి, అప్పుడు హౌజ్-ఎ-కౌసర్ (కౌసర్ జలాశయం) వద్ద మీరు నన్ను కలుసుకుంటారు," అంటే, ప్రళయ దినాన కలుసుకుంటారు మరియు మీకు నాయకత్వం లభించదు. చివరకు, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్ కొరకు ప్రార్థన చేస్తూ ఇట్లు అన్నారు: "ఓ అల్లాహ్! అన్సార్ పై దయ చూపు, అన్సార్ల సంతానంపై దయ చూపు మరియు అన్సార్ల తరువాతి తరాలపై కూడా దయ చూపు."

కథకుడు ఇట్లు అంటున్నారు: మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రసంగం చేస్తున్నప్పుడు అన్సార్ రోదిస్తూ ఉండేవారు, వారి గడ్డం కన్నీళ్లతో తడిసిపోయింది. వారు పదేపదే ఇట్లు అన్నారు: "రజీనా బిరసూలిల్లాహి ఖిస్మన్ వ హజ్జన్" (మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన పంపిణీ మరియు మా వాటా పట్ల మేము హృదయపూర్వకంగా సంతోషిస్తున్నాము).

**(సహి బుఖారి కితాబుల్ ఫరజుల్ ఖమ్స్, బాబ్ మా కాన న్నబియ్యు (స) యుఅతిల్ ముఅల్లఫతు ఖులూబిహిం ...హదీస్ 3147)(సహి బుఖారి కితాబుల్ మఘాజి, బాబ్ ఘజ్వతు తాయిఫ... హదీస్ 4331)(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ , సంపుటి 4, పేజి 192-193, ఆలముల్‌కుతుబ్)(సీరతున్నబవియ్యతు కమా జాఅత్ ఫిల్ అహాదిసు సహీహతు సంపుటి 4, పేజి 81 మక్తబల్ అబీకాన్ అర్రియాజ్ 2014)(దాయిరే మఅరుఫ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 293-298, బజమే ఇక్బాల్ లాహౌర్)**

కొన్నిసార్లు అజాగ్రత్తగా చేసిన మాటలు చాలా సుదూర పరిణామాలను కలిగి ఉంటాయి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పంపిణీపై అన్సార్లలోని యువకులు అయిష్టత వ్యక్తం చేసినప్పటికీ (అందరూ చేయలేదు), అది దేవుడు మరియు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఎంతగా అసంతృప్తికి గురి చేసిందంటే, అన్సార్‌లు యుగాంతం వరకు దాని పర్యవసానాలను అనుభవించవలసి వచ్చింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర: అ:) ఇట్లు అన్నారు: "మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాను జయించినప్పుడు, మక్కా ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. వారి దృష్టి పూర్తిగా విశ్వాసంతో నిండక, ఇంకా ప్రపంచం వైపే ఉండేది. దాని తర్వాత జరిగిన ఒక యుద్ధంలో ముస్లింలకు కొంత సంపద లభించింది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ సంపదను ఆ ప్రజలలో పంచిపెట్టారు. ఒక అన్సారీ యువకుడు ఒక సభలో ఇట్లు అన్నాడు: 'మా కత్తుల నుండి రక్తం టపటపా కారుతుంది, కానీ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సంపదను తమ బంధువులకు ఇచ్చేశారు.' ఈ విషయం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియగానే, అన్సార్ల పెద్దలను పిలిచి, 'నాకు ఈ విషయం తెలిసింది,' అని అడిగారు. అన్సార్లు రోదిస్తూ, 'ఇదంతా ఒక అమాయకుడు అన్నాడు,' అని అన్నారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: 'లేదు! ఓ అన్సార్లారా! మీరు ఇట్లు చెప్పవచ్చు: 'మహమ్మద్ (స: అ: వ:) కు ఎవరూ ఆశ్రయం ఇవ్వనప్పుడు, ఆయన నగరవాసులు ఆయనను బహిష్కరించినప్పుడు మేము ఆయనకు ఆశ్రయం ఇచ్చాము. తర్వాత ఆయనకు గౌరవం, విజయం లభించినప్పుడు ఆయన సంపదను తమ బంధువులకు పంచిపెట్టారు.' దీనిపై అన్సార్ పెద్దగా ఏడ్చారు మరియు మళ్లీ, 'యా రసూలల్లాహ్! మేము అలా అనలేదు,' అని అన్నారు. అప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: 'మీరు ఈ విషయాన్ని మరొక విధంగా కూడా చెప్పవచ్చు. అదేమిటంటే: దేవుడు ప్రపంచం మొత్తానికి మార్గదర్శకత్వం కొరకు పంపిన వ్యక్తి మక్కాకు చెందినవారు, కానీ దేవుడు ఆయనను మదీనాకు తీసుకువచ్చాడు. తర్వాత దేవుడు తన శక్తి, వైభవంతో మక్కాను ఆయన కోసం జయింపజేశాడు. ఆ సమయంలో మక్కా వాసులు తమ వస్తువు (ప్రవక్త) తమకు లభిస్తుందని భావించారు, కానీ మక్కా వాసులు గొర్రెలు, ఒంటెలను తీసుకొని వెళ్లారు మరియు మదీనా ప్రజలు దేవుని ప్రవక్తను తమ నగరానికి తీసుకువెళ్లారు.' తర్వాత ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: 'నిస్సందేహంగా ఈ మాట ఒక అమాయకుని నోటి నుండి వెలువడింది, కానీ దీని కారణంగా ఇప్పుడు మీకు ఈ లోకంలో రాజ్యం లభించదు. ఇప్పుడు మీ సేవల ప్రతిఫలం మీకు హౌజ్-ఎ-కౌసర్ వద్ద మాత్రమే లభిస్తుంది.' చూడండి, ఆయన (ర: అ:) ఇట్లు అన్నారు: 'చూడండి! చరిత్ర చెబుతోంది: పదమూడు శతాబ్దాలు గడిచిపోయాయి మరియు పద్నాలుగో శతాబ్దం కూడా దాటిపోయింది. ఈ కాలంలో ప్రతి జాతి ఇస్లాం కారణంగా రాజుగా మారింది, కానీ ఏ ఒక్క అన్సారీ రాజు కాలేకపోయాడు. అందువలన, కొన్నిసార్లు ఒక వ్యక్తి మాట మొత్తం జాతికి నష్టాన్ని కలిగించవచ్చు'." **(ఖుత్బాతే మహ్మూద్, సంపుటి 17, పేజి 728, జుమా ప్రసంగం 4 డిసంబర్ 1936)**

అందువలన, హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు తఆలా అన్హు ఈ సంఘటనను తమ ఖుత్బాలో వివరించి, దాని ఆధారంగా జమాఅత్ కు చేసిన ఉపదేశం నేటికీ మనకు అంతే ముఖ్యమైనదిగా ఉంది. ఆయన (ర: అ:) ఇట్లు ఉపదేశించారు: "ఆ వ్యక్తులు, ఎవరైతే పదవి పొందడానికి లేదా సంపద మొదలైన వాటిని పొందడానికి త్యాగం చేస్తున్నారో, వారు నా పిలుపుపై (అంటే, వర్తమాన ఉత్తరాధికారి పిలుపుపై) త్యాగం చేయడానికి అస్సలు రాకూడదు." "బదులుగా, దైవం కొరకు త్యాగం చేసే ప్రజలు మాత్రమే రావాలి. ఎందుకంటే నేను స్వయంగా బలహీనమైన, అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని. నేను ఎవరి ఉపకారాన్ని మోయలేను." "కావున, నేను నా కొరకు అడగడం లేదు. ఎవరైతే అల్లాహ్ తఆలా కొరకు ఇస్తున్నారో, వారు ఇవ్వాలి. అల్లాహ్ తఆలా దాని ప్రతిఫలాన్ని కూడా ఇస్తాడు. అల్లాహ్ తఆలాపై నమ్మకం ఉంచుకోవాలి. అతడు తలచుకుంటే ఈ లోకంలో ఇస్తాడు, లేదా కోరుకుంటే పరలోకంలో ఇస్తాడు." "ఏదేమైనా, ఎవరైతే నిష్కపటంగా త్యాగం చేస్తారో, వారి త్యాగం వృథా కాదు. విశ్వాసి త్యాగాన్ని ఎవరూ వృథా చేయలేరు. కావున, త్యాగం చేసేవారు ప్రపంచాన్ని కాకుండా, దైవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. **(ఖుత్బాతే మహ్మూద్, సంపుటి 17, పేజి 728-729, జుమా ప్రసంగం 4 డిసంబర్ 1936)**

'అందువలన, త్యాగం, పదవి కొరకు ఎల్లప్పుడూ అల్లాహ్ తఆలా ప్రసన్నతను మాత్రమే దృష్టిలో ఉంచుకోవాలి, అప్పుడే వారు అల్లాహ్ తఆలా నిజమైన అనుగ్రహాలను పొందగలుగుతారు." "ఒక వయస్సు వచ్చిన తర్వాత, జమాఅత్ సభ్యులలో కూడా ఈ భావన కలుగుతుంది: 'మాకు ఇంత అనుభవం ఉంది, మేము ఇంత పని చేశాము, మాకు దీనికి రివార్డు లభించాలి, కానీ అది ఇవ్వబడలేదు.' కాబట్టి, వారు ఆలోచించుకోవాలి: కేవలం లోకపరమైన రివార్డునే తీసుకోవాలా, లేక అల్లాహ్ తఆలా అనుగ్రహాల కు వారసులుగా మారాలా?"

"అన్సారుల్లాహ్ ఇజ్తిమా కూడా నేటి నుండి జరుగుతోంది. ఈ సందర్భంలో నేను అన్సార్ తో ఇదే చెబుతున్నాను. ఎందుకంటే అనుభవం వచ్చినప్పుడు ఈ వయస్సులో ఇటువంటి ఆలోచన వస్తుంది. ఎవరి మనస్సులోనైనా తమ అనుభవం, సేవ గురించి ఏదైనా భావన కలిగినట్లయితే, వారు దానిని వెంటనే తొలగించుకోవాలి, అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందుటకు ప్రయత్నించాలి."

"ఈ సందర్భంలో గ్రామీణ ప్రజలు చూపిన అసహనం గురించి కూడా తెలుస్తుంది. యుద్ధ సంపద పంచుతున్నప్పుడు, కొంతమంది గ్రామీణ ప్రజలు కూడా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టూ గుమిగూడి ధనాన్ని అడగడం మొదలు పెట్టారు." "వారి రద్దీ కారణంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శుభ్రమైన చద్దరు కూడా ఒక ముళ్ల పొదకు తగులుకుంది. కొద్దిగా తోపులాట జరిగినప్పుడు, వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు అన్నారు: 'నా చద్దరు నాకు తిరిగి ఇచ్చేయండి.' "తర్వాత, ఆ ముళ్ల చెట్ల వైపుకు సంజ్ఞ చేస్తూ ఇట్లు అన్నారు: 'ఈ ముళ్ల చెట్ల సంఖ్యకు సమానంగా నా వద్ద ఒంటెలు ఉన్నప్పటికీ, వాటిని కూడా నేను మీ అందరిలో పంచిపెట్టేవాడిని. మరియు మీరు నన్ను లోభిగా, అబద్ధం చెప్పేవాడిగా లేదా పిరికివానిగా పొందలేరు.'" "మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గ్రామీణ ప్రజల ఈ అనాగరిక ప్రవర్తనకు వారిని ఏ మాత్రం శిక్షించలేదు, కోపం కూడా చూపలేదు, బదులుగా నవ్వుతూ ఉత్తమ పద్ధతిలో వారికి శిక్షణ ఇచ్చారు మరియు వారికి ధనాన్ని కూడా ప్రసాదించారు."

**(దాయిరే మాఅరిఫ్, సీరత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 299,బజమే ఇక్బాల్ లాహౌర్)**

దీనిని ప్రస్తావిస్తూ హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర: అ:) ఇట్లనిరి. "ఆ యుద్ధాలు ముగిసిన తర్వాత, పరాజయం పాలైన శత్రువుల నుండి జరిమానాల ద్వారా, యుద్ధ మైదానంలో వదిలిపెట్టిన వస్తువుల ద్వారా సేకరించబడిన ఆ సంపదను అప్పుడున్న ఆచారం ప్రకారం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లామీ సైన్యంలో పంచిపెట్టవలసి ఉండేది. "కానీ ఈ సందర్భంలో, వారు (స: అ: వ:) ఆ సంపదను ముస్లింలలో పంచిపెట్టే బదులు, మక్కా మరియు దాని చుట్టుపక్కల

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు:** ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహాదీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు:** ***Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

ప్రజలలో పంచిపెట్టారు. ఈ ప్రజలలో ఇంకా విశ్వాసం పూర్తిగా ఏర్పడలేదు. చాలా మంది అప్పటికీ అవిశ్వాసులుగానే ఉండేవారు. ముస్లింలు అయినవారు కూడా ఇంకా కొత్తగా ముస్లింలు అయినవారే. ఒక జాతి తమ సంపదను ఇతర ప్రజలలో పంచిపెట్టడం వారికి పూర్తిగా ఒక కొత్త విషయంగా ఉండెను." "ఈ సంపద పంపిణీ వలన వారి హృదయాలలో పుణ్యం, దైవభీతి ఏర్పడడానికి బదులుగా, కొందరిలో దురాశ మరింత పెరిగింది. వారు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టూ గుమిగూడారు మరియు మరిన్ని కోరికలతో ఆయనను ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టారు. చివరికి వారు ఆయనను నెట్టుకొంటూ ఒక చెట్టు వరకు తీసుకువెళ్లారు, మరియు ఒక వ్యక్తి అయితే ఆయన భుజాలపై ఉన్న చద్దరును పట్టుకొని ఈ విధంగా మెలితిప్పడం మొదలుపెట్టాడు, దాని వలన ఆయన శ్వాస ఆగిపోవడం మొదలైంది." "అప్పుడు వారు (స: అ: వ:) ఇట్లు అన్నారు: 'ఓ ప్రజలారా! నా వద్ద ఇంకా ఏమైనా ఉన్నట్లయితే, నేను దానిని కూడా మీకే ఇచ్చేవాడిని. మీరు నన్ను ఎన్నడూ పిసినారిగా లేదా పిరికివానిగా పొందలేరు'." "తర్వాత వారు తమ ఒంటె వద్దకు వెళ్లి, దాని నుండి ఒక వెంట్రుకను తెంచి, దానిని పైకి లేపి ఇట్లు అన్నారు: 'ఓ ప్రజలారా! అరబ్ చట్టం ప్రకారం ప్రభుత్వ వాటా అయిన ఐదవ భాగం తప్ప, మీ ధనంలో నుండి నాకు ఈ వెంట్రుకకు సమానంగా కూడా అవసరం లేదు, ఆ ఐదవ భాగాన్ని కూడా నేను నాపై ఖర్చు చేసుకోను, బదులుగా అది కూడా మీ ప్రజల పనులకే ఖర్చు చేయబడుతుంది.' గుర్తుంచుకోండి, ద్రోహం చేసినా వ్యక్తి ప్రళయదినాన అల్లాహ్ సన్నిధిలో ఈ ద్రోహం కారణంగా అవమానానికి గురవుతాడు."

"ప్రజలు ఇట్లు అంటారు: 'ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం రాజరికానికి ఆశపడ్డారు'. రాజులు, సామాన్య ప్రజల మధ్య ఇటువంటి సంబంధం ఉంటుందా? రాజును ఈ విధంగా నెట్టుకుంటూ పోయే లేదా అతని మెడలో వస్త్రం వేసి ఊపిరి ఆడకుండా గొంతు నులిమే ధైర్యం ఎవరికైనా ఉంటుందా? అల్లాహ్ ప్రవక్తలు తప్ప మరెవరైనా ఇలాంటి ఆదర్శాన్ని చూపగలరు?" "అయినప్పటికీ, ఈ విధంగా మొత్తం సంపదను నిరుపేదలలో పంచిపెట్టిన తర్వాత కూడా, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన పంపిణీని న్యాయమైన పంపిణీగా భావించని కఠిన హృదయులు అప్పటికీ ఉన్నారు." **(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 357-358)**

"యుద్ధ సంపద పంపిణీకి సంబంధించి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాధారణ విధానం ఇట్లు ఉండేది: ఆయన యుద్ధ సంపదలో నుండి ఐదవ భాగాన్ని వేరు చేసేవారు. దానిని పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ విచక్షణ మేరకు పంపిణీ చేసేవారు లేదా ఖర్చు చేసేవారు. మిగిలిన మొత్తం సంపదను యుద్ధంలో పాల్గొన్నవారి మధ్య పంచిపెట్టేవారు, ఇందులో కాలి నడకన వచ్చినవారికి మరియు అశ్వదళ సభ్యులకు వేర్వేరు వాటాలు ఉండేవి." "కానీ, హునైన్ యుద్ధ సంపద పంపిణీ గురించి కొందరు అన్సార్ల వైపు నుండి, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాకు ఏమీ ఇవ్వలేదు, ఇతరులకు ఇచ్చారు' అనే ప్రశ్న లేదా అభ్యంతరం వచ్చినప్పుడు, ఈ ప్రశ్న ఉదయిస్తుంది: వారు (సల్లల్లాహు అలైహి వసల్లం) యుద్ధంలో పాల్గొన్నవారికి యుద్ధ సంపదలో నుండి అసలు ఏమీ ఇవ్వలేదా, లేదా వారికి వారి వాటాను మాత్రమే ఇచ్చి మిగిలిన సంపదను ఇతరులలో పంచిపెట్టారా?" "ఏదేమైనా, మా పరిశోధక బృందం అభిప్రాయం ప్రకారం, వారు ఇట్లు అంటున్నారు: 'మేము ప్రవక్త జీవిత చరిత్ర ప్రాథమిక, విశ్వసనీయ గ్రంథాలను పరిశీలించాము. దేనిలోనూ దీనికి స్పష్టమైన సమాధానం ఇవ్వబడలేదు.' అయితే, చరిత్ర మరియు జీవిత చరిత్ర గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ విషయం తెలుస్తుంది: మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పాల్గొన్న వారందరికీ వారి వారి వాటాను ఇచ్చారు. అది ప్రతి ఒక్కరికీ నాలుగు ఒంటెలు లేదా నలభై గొర్రెల రూపంలో ఇవ్వబడింది, అశ్వదళ సభ్యులకు వారి వాటా ఇవ్వబడింది. "వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఖుమ్స్‌లో నుండి మనస్సులను ఆకర్షించడం కోసం ప్రజలకు ధనాన్ని ప్రసాదించారనే సూచన కూడా లభిస్తుంది."కానీ, ఈ యుద్ధ సంపదలో నుండి ఎవరికీ ఏమీ ఇవ్వకుండా ఉండే అవకాశం కూడా ఉంది. అంటే, సాధారణ పద్ధతి ప్రకారం ఈ సంపదను యుద్ధంలో పాల్గొన్నవారిలో పంపిణీ చేయకుండా, మొత్తం సంపదను ఇతరులలో మనస్సులను ఆకర్షించడం కొరకు పంచిపెట్టి ఉండవచ్చు. దీనికి కూడా చరిత్ర మరియు జీవిత చరిత్ర వివిధ గ్రంథాల నుండి మద్దతు లభిస్తుంది."

"హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర: అ:) గారి ఒక ఉదాహరణ నుండి కూడా ఇదే అభిప్రాయం బలపడుతుంది, అది ఇప్పుడే వివరించ బడింది. ఆయన (ర:అ:) ఇట్లు అన్నారు: 'ఆ యుద్ధాలు ముగిసిన తర్వాత, పరాజయం పాలైన శత్రువుల జరిమానాల, యుద్ధ మైదానంలో వదిలిపెట్టిన వస్తువుల ద్వారా సేకరించబడిన ఆ సంపదను అంటే, చెప్పబడిన విధంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లామీ సైన్యంలో పంపిణీ చేయవలసి ఉండేది, కానీ ఈ సందర్భంలో వారు ఆ సంపదను ముస్లింలలో పంపిణీ చేసే బదులు, మక్కా, చుట్టుపక్కల ప్రజలలో పంచిపెట్టారు'." "హదీసులలో లభిస్తున్న కొన్ని కథనాలు ప్రకారం యుద్ధ సంపద పంపిణీ సమయంలో, ఒక గ్రామీణ వ్యక్తి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరై ఇట్లన్నాడు: 'ఓ ముహమ్మద్ (స: అ: వ:)! మీరు నాతో చేసిన వాగ్దానాన్ని పూర్తి చేయండి.' "మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు: 'సంతోషంగా ఉండు.' ఆ గ్రామీణుడు ఇట్లు అన్నాడు: 'మీరు చాలాసార్లు ఇదే చెప్పారు, 'సంతోషంగా ఉండు' అని. అంటే, మీరు ఏమీ ఇవ్వలేదు, కేవలం చెబుతూనే ఉన్నారు.' "మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అతని ఈ ప్రతిస్పందన చాలా అసంతృప్తిని కలిగించింది. వారు సల్లల్లాహు అలైహి వసల్లం అతని వైపు నుండి తమ పవిత్ర ముఖాన్ని పక్కకు త్రిప్పుకున్నారు. అక్కడ హజ్రత్ అబూ మూసా అష్అరీ (ర: అ:) హజ్రత్ బిలాల్ (ర: అ:) నిలబడి ఉండిరి, వారి వైపు తమ ముఖాన్ని త్రిప్పుకుంటూ ఇట్లన్నారు: 'ఇతను శుభవార్తను అంగీకరించడానికి నిరాకరించాడు, ఇప్పుడు మీరు అంగీకరించండి.' "వారిద్దరూ వినగానే, వెంటనే ఇట్లన్నారు: 'యా రసూలల్లాహ్! మేము అంగీకరించాము.' "దాని తరువాత, వారు సల్లల్లాహు అలైహి వసల్లం నీటి గిన్నెను తెప్పించుకొని, అందులో తమ చేతులు, ముఖాన్ని కడుక్కున్నారు. అప్పుడు మీరు సల్లల్లాహు అలైహి వసల్లం మిగిలిన ఆ నీటిని హజ్రత్ అబూ మూసా మరియు హజ్రత్ బిలాల్ (ర: అ:) లకు ఇస్తూ ఇట్లు అన్నారు: 'మీరిద్దరూ ఈ నీటిని త్రాగి, తమ ముఖాలు, ఛాతీపై కూడా చల్లుకోండి, సంతోషంగా ఉండండి.' కావున, వారు ఆ గిన్నెను తీసుకొని అలాగే చేశారు."

"ఇక్కడ పవిత్ర సతీమణుల నిష్కపటత్వం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శుభ వ్యక్తిత్వం నుండి ఆశీర్వాదాన్ని పొందే తపన ఆశ్చర్య, అసూయపడ దగిన దృశ్యం కూడా కనిపిస్తుంది. పక్కనే ఉన్న గుడారంలో విశ్వాసుల తల్లి హజ్రత్ ఉమ్మె సల్మ (ర:అ:) కూడా ఉండిరని వ్రాయబడింది. బహుశా ఈ సంఘటన మొత్తం హజ్రత్ ఉమ్మె సల్మ (ర:అ:) గుడారం దగ్గరే జరిగి ఉంటుంది." "ఆమె తెర వెనుక నుండి హజ్రత్ బిలాల్, హజ్రత్ అబూ మూసా అష్అరీలతో) ఇట్లన్నారు: 'మీ తల్లి కోసం కూడా అంటే, నా కోసం కూడా నీటిని మిగలనివ్వండి'. కావున, వారు హజ్రత్ ఉమ్మె సల్మ (ర: అ:) కోసం కూడా ఆ గిన్నెలో కొంత నీటిని మిగిల్చి అందించారు." **(సహి బుఖారి కితాబుల్ ముఘాజి, బాబ్ ఘజ్వతు త్తాయిఫ్.......హదీస్ 4328)(దాయిరే మాఅరుఫ్ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 300, బజమే ఇక్బాల్ లాహోర్)**

"మరియొక కథనం ఇట్లు ఉంది: ఒక వ్యక్తి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరైనప్పుడు అతడు రెండు కొండల మధ్య ఒక లోయలో ఉన్న గొర్రెల పెద్ద మందను చూశాడు. అతను వారి సల్లల్లాహు అలైహి వసల్లంతో 'దీనిని నాకు ఇచ్చేయండి,' అని అడిగాడు. మహాప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా దానిని అతనికి ఇచ్చేశారు." "ఆ మందను తీసుకుని, అతను తన జాతి ప్రజల వద్దకు వెళ్లి ఇట్లన్నాడు: 'ఓ ప్రజలారా! ముహమ్మద్ (స: అ: వ:) పై విశ్వాసం ప్రకటించండి. ఆయన ఎంతగా ఇస్తారంటే, ఆయనకు పేదరికం, ఆకలితో భయం అస్సలు ఉండదు.' ఈ సంఘటన కూడా అదే సమయానికి చెందినదని చరిత్రకారులు వ్రాశారు:. ఇది కూడా హదీసు కథనమే. ఏదేమైనా, మరిన్ని సంఘటనలు కూడా ఉన్నాయి. వాటిని ఇన్షా అల్లాహ్ తర్వాత వివరిస్తాను.

**(సహి ముస్లిం కితాబుల్ ఫజాయిల్, బాబ్ ఫి సఖాఅ సల్లల్లాహు అలైహి వసల్లం, హదీస్ 2312)(దాయిరే మాఅరుఫ్ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 9, పేజి 300, బజమే ఇక్బాల్ లాహోర్)**

"ఇప్పుడు నేను కొందరు మృతుల గురించి ప్రస్తావించదలిచాను. జుమా ప్రార్థన తర్వాత పరోక్ష అంత్యక్రియల ప్రార్థన కూడా చదివిస్తాను."

ఒకరు గౌరవనీయులైన ఫహీముద్దీన్ నాసిర్ గారు, ముబల్లిగ్ సిల్సిలా రుమేనియా గత కొద్ది రోజుల క్రితం యాభై రెండు (52) సంవత్సరాల వయసులో మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్ (నిశ్చయంగా మేము అల్లాహ్ యొక్కవారము మరియు అతని వైపుకే మేము తిరిగి వెళ్ళే వారము). అల్లాహ్ తఆలా దయతో, ఆయన వసియ్యత్ పథకంలో చేరిరి. వారి కుటుంబంలో అహ్మదియ్యత్ వారి ముత్తాత హజ్రత్ మిర్జా ఇల్మ్ దీన్ గారి ద్వారా ప్రవేశించింది. వీరు లేఖ ద్వారా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం బైఅత్ చేసే సౌభాగ్యాన్ని పొందారు. ఖాదియాన్ సమీపంలో ఉన్న లోధీ నంగల్ గ్రామానికి చెందిన మస్జిద్ ఇమామ్ నూర్ ముహమ్మద్ గారు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం బైఅత్ చేసి తిరిగి గ్రామానికి వచ్చారు. ఆయన తిరిగి వచ్చి, ఇమామ్ మహదీ వచ్చారు, ఆయన సత్యవంతులు, ఆయనను అనుసరించండి అని ప్రకటించారు. ఆ తరువాత, లేఖ ద్వారా బైఅత్ చేసినవారిలో మిర్జా ఇల్మ్ దీన్ గారు కూడా ఉన్నారు. ఫహీముద్దీన్ నాసిర్ గారు 1996వ సంవత్సరం జూన్‌లో జామిఆ అహ్మదియ్యాలో ఉత్తీర్ణులైనారు.

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



తరువాత పాకిస్తాన్‌లో వివిధ ప్రదేశాలలో ఆయన నియామకం జరిగింది. ఆ తర్వాత ఆయన తఫ్సీర్ ఖుర్ఆన్ అనగా ఖుర్ఆన్ విశ్లేషణలో స్పెషలైజేషన్ కూడా చేశారు." "2006వ సంవత్సరంలో ఆయనను రుమేనియాకు పంపారు మరియు మరణించే వరకు ఆయన అక్కడే సేవ చేసే భాగ్యాన్ని పొందారు.

ఆయన సతీమణి, నసీరా ఫహీమ్, ఇట్లు వ్రాశారు: 'ఆయన ఒక ఆదర్శప్రాయమైన భర్త. నా భావోద్వేగాలను మరియు మనోభావాలను నేను చెప్పకముందే అర్థం చేసుకునేవారు. పిల్లల పట్ల గొప్ప శ్రద్ధ వహించే తండ్రి. జీవితంలోని ముఖ్య అంశాలలో అల్లాహ్ తఆలాతో బలమైన అనుబంధం, అల్లాహ్ మీద ఆధారపడటం, ఆరాధన, ప్రార్థన, సహనం, ధైర్యం, వివేకం, సహనం, ధర్మ సేవ పట్ల ఆసక్తి, ఉత్సాహం, తమ బాధ్యతలను నిర్వర్తించే భావన, నిర్ణీత సమయంలో ప్రతి పనిని పూర్తి చేయడం వంటివి ఉండేవి." "ఖిలాఫత్ తో లోతైన ప్రేమ, నిష్కపటమైన అనుబంధం ఉండేది. ప్రతి వ్యక్తిగత, జమాఅత్ పనికి ముందు వర్తమాన ఖలీఫా సేవలో వ్రాసి మార్గదర్శకత్వం తీసుకునేవారు. ఆయన జమాఅత్ సభ్యులకు మరియు తమ పిల్లలకు ఎల్లప్పుడూ తమ ఆచరణాత్మక ఉదాహరణతో శిక్షణ ఇచ్చేవారు. అర్థం చేయించే విధానం చాలా బాగుండేది. సమయానికి నమాజులు చేయడం, తహజ్జుద్, నవాఫిల్ (ఐచ్ఛిక ప్రార్థనలు) చదవడం ఆయన నిత్యకృత్యం. అనారోగ్యం తీవ్రమైనప్పుడు కూడా నమాజులు చేయడంలో శ్రద్ధ చూపేవారు. చివరికి, అనారోగ్యం తీవ్రమైనప్పుడు ఆయనకు క్యాన్సర్ వచ్చింది మాట్లాడటం కూడా కష్టమైంది, అప్పుడు సైగ ద్వారా 'కాపీ తీసుకురా' అని చెప్పి వ్రాశారు: 'ఆరాధన, అల్లాహ్ తఆలా సన్నిధిలో ప్రార్థన, ప్రతి కష్టం, ఇబ్బందిలో అల్లాహ్ సన్నిధిలో తల వంచండి.' తమ భార్యాబిడ్డలకు ఇట్లు ఉపదేశించారు: 'ఏం జరిగినా, మీరు అల్లాహ్ ద్వారాన్ని విడిచిపెట్టవద్దు. ఎల్లప్పుడూ దేవుడినే అడగాలి, అల్లాహ్ తఆలాతోనే సజీవ అనుబంధాన్ని పెంచుకోండి, అల్లాహ్ తోనే స్నేహం చేయండి. అతడు మిమ్మల్ని కష్టాల్లో ఎప్పుడూ ఒంటరిగా విడిచిపెట్టడు. ధర్మ ప్రచారం, జమాఅత్ గురించి పరిచయం చేసే అవకాశాన్ని ఎప్పుడూ చేజార్చుకునేవారు కాదు. తమ వెంట ఎల్లప్పుడూ జమాఅత్ పరిచయ కర పత్రాలు, చిన్న పుస్తకాలు ఉంచుకునేవారు. ఆసుపత్రిలోని డాక్టర్ల వద్దకు వెళ్ళినప్పుడు కూడా వారికి ప్రచారం చేసేవారు. 'నేను డాక్టర్లకు కూడా సందేశం అందిచానని' గొప్ప కృతజ్ఞత వ్యక్తం చేసేవారు. వారి ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు ఉండేది, చాలా కలివిడిగా ఉండేవారు. ఆయన స్వభావం కారణంగా ప్రతి ఒక్కరూ ఆయనకు ఆకర్షితులయ్యేవారు. ఆయన మరణ వార్త విని, మిషన్ హౌస్ దగ్గర నివసించే రుమేనియన్ పొరుగువారు ఏడుస్తూ తమ భావాలను వ్యక్తం చేశారు, తీవ్ర దిగ్భ్రాంతిని తెలిపారు." "అనారోగ్య సమయంలో కూడా తమ అధికారిక విధులను నిరంతరం నిర్వర్తించారు. మరణానికి కేవలం రెండు రోజుల ముందు వరకు, ఆరోగ్యం చాలా బలహీనంగా ఉన్నప్పటికీ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్నప్పటికీ, ఆహారం తీసుకోవడం కష్టంగా ఉన్నప్పటికీ, జమాఅత్ లేఖలు వ్రాయడం, ఏదైనా అత్యవసర ఇ-మెయిల్కు సమాధానం వ్రాయడం కొనసాగించారు, ఒక అత్యవసర ఇ-మెయిల్కు సమాధానం కూడా ఇచ్చారు. రుమేనియాలో జమాఅత్ బలపడాలని ఆయన కోరిక, కనుక దేశ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సరైన వ్యూహంతో దాని కోసం కృషి చేసేవారు. పిల్లలతో ఇట్లు చెప్పేవారు: 'మీ పాత్ర, ప్రవర్తన తబ్లీగ్‌కు మాధ్యమంగా ఉండేలా ఉండాలి.' రుమేనియన్ భాషలో పవిత్ర ఖుర్ఆన్ అనువాదాన్ని పూర్తి చేయాలనుకున్నారు, ఒకటిన్నర పారా అనువాదం పూర్తి చేశారు, కానీ ఇతర పనుల కారణంగా మరింత పని చేయలేక పోయారు. అదేవిధంగా, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పుస్తకాలను కూడా అనువదిస్తున్నారు." "వివిధ రంగాలకు చెందిన స్థానిక రుమేనియన్లతో ఆయన కలిసినప్పుడల్లా, రుమేనియన్లు ఇట్లు అనేవారు: ఆయన భాష చాలా మర్యాదపూర్వకంగా, సాహిత్యపరంగా ఉండేది, దీనిని సాధారణంగా విశ్వవిద్యాలయంలో బోధించే ప్రొఫెసర్‌లు మాట్లాడుతారు. అక్కడి స్థానిక ప్రజలు ఇట్లన్నారు: ఏ ఇతర రుమేనియన్ కాని వ్యక్తిని ఇంత మంచి, అద్భుతమైన భాష మాట్లాడటం మేము చూడలేదు, ఆయన భాష చాలా బాగుండేది."

"ఆయన తల్లి, సఫియా బేగం, ఇట్లన్నారు: కీర్తిశేషులు తాతగారు, అమ్మమ్మగారు ఇద్దరూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అనుచరులు. మురబ్బీ గారు ఉన్నత నైతికతకు యజమాని, ప్రతి ఒక్కరూ దీని గురించి ప్రస్తావిస్తున్నారు. మంచి ప్రవర్తన, సహనం, ధార్మిక పనుల పట్ల ఆసక్తిని అల్లాహ్ తఆలా ఆయనకు ప్రసాదించాడు. ఆమె ఇట్లన్నారు: ఆయన చాలా విధేయతగల కొడుకు. ఆయన తండ్రి ఆయన పుట్టకముందే ఒక కల చూశారు: వారు ఒక బిడ్డను ఎత్తుకున్నారు, అతని నుదుటిపై చంద్రుడు, నక్షత్రం ఉన్నాయని చూశారు. తర్వాత ఆమె ఇట్లన్నారు: ఆయన మురబ్బీ అయినప్పుడు, 'ఇన్షా అల్లాహ్ తఆలా, ఆయన ఒక రోజు తప్పకుండా ప్రకాశిస్తార'ని మాకు అర్థమైంది." రుమేనియాలో సేవలు మరియు నిబద్ధత: "2006వ సంవత్సరంలో ఆయన రుమేనియాకు వెళ్లారు. ఆయన రుమేనియాకు మొదటి ముబల్లిగ్. ఆయన అక్కడి భాషను చాలా అద్భుతంగా నేర్చుకున్నారు, అక్కడి నుండే గ్రాడ్యుయేషన్ డిగ్రీ కూడా పొందారు. ఆయన జమాఅత్ కొరకు గొప్ప పని చేసి, అక్కడ జమాఅత్‌ను రిజిస్టర్ చేయించారు. మిషన్ హౌస్‌ను స్థాపించారు, రోజువారీ పనిని పూర్తి చేయనంత వరకు విశ్రాంతి తీసుకునేవారు కాదు."

"ఆయన సోదరుడు, రఫీఉద్దీన్, ఇట్లన్నారు: మెట్రిక్ తర్వాత ఎవరూ చెప్పకుండానే స్వయంగా జామిఆ అహ్మదియ్యాలో చేరారు. జీవిత సమర్పణను చాలా అద్భుతంగా, నిజాయితీగా నిర్వర్తించారు. ఆయన సెలవు కూడా తీసుకునేవారు కాదు. కేవలం ఒక్కసారి మాత్రమే సెలవు తీసుకున్నారని చెబుతారు, అది కూడా ఆయన చిన్న సోదరి మరణించినప్పుడు."

"ఆయన కుమారుడు, మీర్జా లబీద్, ఇట్లన్నారు: నేను మెడికల్ కాలేజీలో చేరాను, నాకు ఈ చదువు పూర్తి అవుతుందో లేదో అని ఆందోళన చెందాను. ఆయన నాకు ప్రతిరోజూ ఫోన్ చేసి ధైర్యాన్ని ఇచ్చేవారు. దరూద్ షరీఫ్ చదవడానికి, తహజ్జుద్ చదవడానికి, ప్రార్థనలు చేయడానికి, కష్టపడి పనిచేయడానికి ఉపదేశించేవారు, ఈ విధంగా ఆయన నన్ను ఎంతగానో ప్రోత్సహించారు." "ఆయన రెండవ కుమారుడు, దానిష్, ఇట్లన్నారు: ఆయనను ఒక్కసారి కలిసిన వ్యక్తి కూడా ఆయన మరణ వార్త విని ఏడ్చాడు, ఆయన చాలా పుణ్యవంతుడు, దైవభీతి గల మనిషి. ఆయన అమితంగా దయ చూపేవారు.


లెటోవియా ముబల్లిగ్ ఇట్లు వ్రాశారు: కీర్తిశేషులు చాలా కష్టపడేవారు, మంచి నైతికత, సంతోషకరమైన స్వభావం కలవారు. ఆయన వినయం, నిరాడంబరత, సాధారణత్వం ప్రతి ఒక్కరినీ ఆయనకు ఆకర్షితులను చేసేది. ఆయన స్వభావంలో ఒక ప్రత్యేకమైన ఉత్సాహం ఉండేది. ముఖంలో చిరునవ్వు ఉండేది. ఆయన దేశం రుమేనియాలో విద్య కోసం ఉన్న విద్యార్థులతో కూడా చాలా దయగా, ప్రేమగా వ్యవహరించేవారు."

"మెడికల్ కాలేజీ విద్యార్థి ప్రస్తుతం డాక్టర్ అయిన తస్వీర్ జావేద్, ఇట్లన్నారు: విద్యార్థులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వడానికి, ఆయన అహ్మదీ విద్యార్థులు చదువుతున్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ట్రైన్ లేదా బస్సులో చాలా గంటలు ప్రయాణించి వచ్చేవారు. జమాఅత్ డబ్బును ఆదా చేయడం గురించి ఆయనకు చాలా శ్రద్ధ ఉండేది. జమాఅత్ డబ్బును ఆదా చేయడానికి, ఆయన అట్టపెట్టెలను, వివిధ వస్తువులను పోగుచేసి, స్వయంగా డైస్‌ను కూడా తయారు చేసుకున్నారు. తీవ్రమైన అనారోగ్యంలో కూడా, ఆఖరి క్షణాల వరకు చాలా కష్టం ఉన్నప్పటికీ, ఆయన నమాజులను సలుపేవారు. ఆయన చాలా సాధారణ, వినయపూర్వకమైన వ్యక్తి. ఆయన పిల్లలకు కూడా మర్యాద, వినయాన్ని నేర్పడానికి ప్రయత్నించారు."

"రుమేనియాకు చెందిన ఒకరు, అజీమ్ రొమాన్ షమ్స్ ఇట్లన్నారు: పరీక్షలు చాలా కష్టంగా ఉండేవి, నేను పాస్ అవ్వలేనేమోనని నాకు అనుమానం ఉండేది. మురబ్బీ గారు నాకు ధైర్యం చెప్పేవారు, 'నువ్వు చింతించకు. పరీక్షకు ఒక వారం ముందు నేను నీకు కొన్ని ముఖ్యమైన చిట్కాలు వివరిస్తాను, వాటి వలన నువ్వు ఇన్షా అల్లాహ్ తప్పక విజయం సాధిస్తావు'. ఆయన చెప్పిన దాని వలన వారికి లాభం చేకూరింది."

"రుమేనియాకు చెందిన కొత్తగా బైఅత్ చేసిన వ్యక్తి, అదీల్ అద్నియాన్ ఇట్లన్నారు: నేను ఆయనను హాస్పిటల్‌కు తీసుకువచ్చినప్పుడు, మరుసటి రోజు ఆయన ఒక జమాఅత్ పని నిమిత్తం నాకు సహాయం చేయమని అడిగారు, దాని కోసం సమీప పట్టణానికి రావాల్సి ఉంది. మేము ఆ పని కోసం వెళ్ళినప్పుడు, మార్గంలో వివిధ విషయాలపై మాట్లాడుకుంటూ, ఒక సందర్భంలో మురబ్బీ గారు కొంత ఉద్వేగభరితమైన స్థితిలో కొన్ని నిమిషాల పాటు నాతో ఇట్లన్నారు: 'ఒకవేళ దైవికంగా నాకు ఏదైనా జరిగితే, నేను ఇక్కడే సమాధి కావాలని అనుకుంటున్నాను. తద్వారా నేను ఇక్కడ ఉన్నానని, ఇక్కడ ఒక సానుకూల మార్పు తీసుకురాగలిగానని గుర్తుంటుంది.'" "తర్వాత ఆయన ఇట్లు వ్రాశారు: ఆరోగ్యం మరింత క్షీణించినప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ తమ ల్యాప్‌టాప్‌లో పనిచేసేవారు, స్వయంగా ఉత్తరం వ్రాసి తమ పనిని కొనసా గించడానికి పూర్తి ప్రయత్నం చేసేవారు. ఆయన ఎల్లప్పుడూ అల్లాహ్ ధర్మం గురించి, ఇతరుల గురించే ఎక్కువగా చింతిస్తూ ఉండేవారు. తమ చివరి శ్వాస వరకు ఒక్క క్షణం కూడా తమ గురించి ఆలోచించ లేదు. ఈ కొత్తగా బైఅత్ చేసిన వ్యక్తి ఇట్లు వ్రాశారు: 'మురబ్బీ గారు తమ సమయాన్ని, నిద్రను ఇతరుల కోసం త్యాగం చేయడం నేను చూశాను. ఇతరులకు సేవ చేసే అవకాశం లభించినందుకు ఆయన ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండేవారు. 'నేను ఆయన నోటి నుండి ఎవరి గురించి కూడా చిన్నపాటి చెడు మాట కూడా ఎప్పుడూ వినలేదని అన్నారు. ఆయన ఏడుస్తూ, తమ కుటుంబ సభ్యుల కోసం మాత్రమే కాకుండా, మా రుమేనియా జమాఅత్, దాని సభ్యుల కోసం కూడా ప్రార్థనలు చేసేవారు. ఆయన ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు, ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలని కూడా

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 15 - JAN 2026, Issue No - 3.

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

ఎప్పుడూ కోరుకోలేదు. ఎందుకంటే తమ అత్యుత్తమ సామర్థ్యంతో జమాఅత్‌కు అన్ని విధాలా సేవ చేయడం తమ కర్తవ్యం అని ఆయన అనేవారు. దాని కోసం తమ నిద్రను లేదా ఆరోగ్యాన్ని ఎంత త్యాగం చేయవలసి వచ్చినా సరే.” “ఆయన ఎల్లప్పుడూ అల్లాహ్ తఆలాపైనే తమ పూర్తి నమ్మకం ఉంచేవారు. ఇతరులను కూడా ఎక్కువగా దుఆ చేయమని, అతని సహాయంపై నమ్మకం ఉంచమని ఉపదేశిస్తూ ప్రోత్సహించేవారు. ఈ కొత్తగా బైఅత్ చేసిన వ్యక్తి ఇట్లు వ్రాశారు: ‘నాకు మురబ్బీ గారు కేవలం ఒక మురబ్బీ మాత్రమే కాదు, ఒక తండ్రి వంటివారు. ఆయన నాకు అసాధారణమైన ఆధ్యాత్మిక మార్గదర్శి, ఒక మంచి, సన్నిహిత మిత్రుడు.’

ఇవి మురబ్బీ లక్షణాలు, వాటిని ఈ కొత్తగా బైఅత్ చేసిన వ్యక్తి వివరించారు, ఈ శిక్షణ, ఈ ఉదాహరణే ప్రచారం, శిక్షణలో సౌలభ్యాన్ని, సానుకూల ఫలితాలను ఇస్తుంది.” “విదేశంలో ధర్మం కొరకు త్యాగం అయినారు, ఈ దృక్కోణం వలన ఆయన స్థానం కూడా అమరుడి స్థానమే. చివరి శ్వాస వరకు తమ వాగ్దానాన్ని గొప్పగా, పూర్తిగా నిలబెట్టుకున్నారు. నేను కూడా ఎల్లప్పుడూ ఆయన ముఖంలో చిరునవ్వునే చూశాను.”

“మారిషస్‌లో తమ కార్యరంగంలో మరణించిన మౌల్వీ ఉబైదుల్లా గారి గురించి హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు తఆలా అన్హు ప్రస్తావిస్తూ, అటువంటి వారు అమరులని, మనం కీర్తిశేషుల నుండి పాఠం నేర్చుకోవాలని జమాఅత్‌కు ఉపదేశించారు. **(ఖుత్బాతే మహ్మూద్, సంపుటి 8, పేజి 263-264, జుమా ప్రసంగం 7 డిసంబర్ 1923)**

నిశ్చయంగా, ఫహీమ్ నాసిర్ కీర్తిశేషులు కూడా అటువంటి పాత్రనే కలిగి ఉన్నారు. ఈ ఉదాహరణ, ముఖ్యంగా జీవిత సమర్పితులకు ఒక పాఠం. అల్లాహ్ తఆలా కీర్తిశేషుల స్థాయి అంతస్తులను పెంచుగాక, వారి భార్యాబిడ్డలకు, తల్లికి అందరికీ సహనాన్ని ప్రసాదించు గాక.”

“రెండవ ప్రస్తావన గౌరవనీయులైన అబ్దుల్ అలీమ్ ఫారూఖీ గారిది. ఈయన కెనడా నివాసి అయిన అబ్దుర్రషీద్ ఫారూఖీ గారి కుమారుడు. గత కొద్ది రోజుల క్రితం ఆయన మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. “కీర్తిశేషులు వసియ్యత్ పథకంలో చేరినారు. ముగ్గురు సాయుధ వ్యక్తులు ఆయన ఇంట్లోకి చొరబడ్డారు. ఆయన తన గదిలో నిద్రిస్తున్నారు. ఆయన భార్య మరియు ముగ్గురు పిల్లలు క్రింద ఉన్నారు. కొడుకు కూడా తన గదిలో ఉన్నాడు. దొంగలు అందరి ఫోన్లను తీసుకున్నారు. కీర్తిశేషులు శబ్దం విని మేల్కొన్నారు. ఒక దొంగ ఆయన గదిలోకి ప్రవేశించాడు. కీర్తిశేషులు ఆ దొంగను భయపెట్టాలని ప్రయత్నించారు, ఆ సమయంలో అతను ఒక కర్రతో ఆయన ముక్కు మరియు భుజంపై కొట్టి పారిపోయాడు.” “ఆ సమయంలో కీర్తిశేషులు తమ కొడుకు గది వైపు వెళ్లసాగారు, అప్పుడు మెట్ల దగ్గర నిలబడి ఉన్న ఒక దొంగ ఆయనపై రెండుసార్లు కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ కీర్తిశేషుల గుండెకు దగ్గరగా తాకి, శరీరం నుండి బయటకు వెళ్లిపోయింది. అక్కడికక్కడే ఆయన మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.” “వీరు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అనుచరులైన హజ్రత్ మౌల్వీ ఖుద్రతుల్లాహ్ గారు సన్నొరీ మరియు హజ్రత్ మౌల్వీ ముహమ్మద్ హుసేన్ గారి మునిమనుమలు (పడ్‌నవాసే). వారు జమాఅత్ చురుకైన సభ్యుడుగా ఉండేవారు. మీరు ఐదు పూటల నమాజులు, తహజ్జుద్లను క్రమం తప్పకుండా చదివేవారు. వీరు ప్రజలను అల్లాహ్ వైపుకు పిలిచే ఉత్సాహం గల వ్యక్తి. వీరికి తమ ప్రాంతంలో స్థానిక ప్రచార కార్యదర్శిగా సేవ చేసే అవకాశం లభించింది. ఆ సమయంలో వీరు స్థానిక అధ్యక్షుడుగా కూడా సేవ చేస్తున్నారు. మృతుని జ్ఞాపకార్థం ఆయన భార్యతో పాటు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.”

“మిషనరీ ఇన్‌చార్జి అయిన జకరియా ఖాన్ గారు, ఆయనకు బంధువు. ఆయన ఇట్లు వ్రాశారు: ‘ఆయన చాలా పుణ్య స్వభావం గలవారు, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే వ్యక్తి. ఆయన భార్య చెప్పినదాని ప్రకారం, ఆయన తహజ్జుద్ నమాజును క్రమం తప్పకుండా చేసేవారు. ఐదు పూటల నమాజులను చక్కగా సంస్కరించి చేసేవారు. ఆయన ఉత్సాహంతో ప్రజలను అల్లాహ్ వైపు పిలిచేవారు. తమ పనులలో నిమగ్నమైనప్పటికీ, పగలూ రాత్రీ జమాఅత్ పనుల్లో నిమగ్నమై ఉండేవారు. ఆర్థిక త్యాగంలో చురుకుగా పాల్గొనేవారు. ఖిలాఫత్ తో లోతైన విశ్వాస బంధం ఉండేది.”

“ఆయన సతీమణి, మరియం గారిఇట్లు వ్రాశారు: ‘ఆయన మంచి భర్త. ఆయన నుండి నేను జీవితంలో చాలా నేర్చుకున్నాను. ఆయనకు ధర్మ ప్రచారం చేయాలనే ఆసక్తి, ఆశ్చర్యకరమైన ఉత్సాహం ఉండేది. ఎల్లప్పుడూ కొత్త ప్రచారం గురించి ఆలోచించేవారు, వాటిని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించే వారు.’ ఖిలాఫత్తో ఉన్న అనుబంధం గురించి కూడా ఆమె వ్రాశారు. పొరుగువారితో, స్థానికులతో ఆయన చాలా మంచిగా ప్రవర్తించే వారు, అందరూ ఆయనకు ఆకర్షితులయ్యేవారు. ఆయన సంతోషకరమైన స్వభావం మరియు దయాగుణం కలవారు. ఇంట్లో ఎప్పుడూ సామూహిక నమాజు చేసేవారు. పిల్లలకు కూడా దీని గురించి ఉపదేశించేవారు.”

“వారి కుమార్తె ఉజ్మా, ఇట్లన్నారు: ‘చిన్న చిన్న విషయాల నుండి పెద్ద పెద్ద అవసరాల వరకు ఆయన చింతిస్తూ ఉండేవారు. రోజంతా తమ పనిలో లేదా జమాఅత్ పనులలో నిమగ్నమై ఉన్నప్పటికీ, రాత్రి నిద్రించే సమయంలో మా గదికి వచ్చి, మా యోగక్షేమాలను అడిగేవారు, ‘సమయం ఎలా గడిచింది, నమాజులు మొదలైనవి చదివారా లేదా?’ అని అడిగేవారు. ఆయన తమ గురించి కూడా చెప్పేవారు. కాబట్టి, మాకు ఆయనతో ఒక స్నేహపూర్వక వాతావరణం ఉండేది’.”

“ఆయన కుమారుడు, అజీజమ్ కజీమ్ ఇట్లన్నారు: ‘మాకు మా నాన్నగారు ఆదర్శం. నేను ఇన్షా అల్లాహ్ ఆయన మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తాను’. మేము ప్రతి ఆదివారం ధర్మ ప్రచారం కోసం వెళ్లేవాళ్లం. అవకాశం దొరికిన చోటల్లా ప్రచార స్టాల్స్ ఏర్పాటు చేసేవాళ్ళం. ఆయన నాకు ఖుర్ఆన్ కంఠస్థం కూడా చేయించారు.” “ఇక్కడ ఉన్న షజర్ ఫారూఖీ గారికి ఆయన మేనల్లుడు. ఆయన కూడా ఇదే విషయాన్ని వ్రాశారు, అన్ని మంచి లక్షణాలను వివరించారు. ఆయన చాలా నిర్మలమైన హృదయం, మంచి నడవడిక, ఉన్నత నైతికత గల వ్యక్తి. ఆయనకు ఉమ్రా చేసే భాగ్యం లభించినప్పుడు, అక్కడి ప్రజలు కూడా ‘ఆయన లో మేము ఆరాధన పట్ల అసాధారణమైన ఆసక్తి మరియు శ్రద్ధను చూశాము, అది ప్రశంసించదగినది’ అని అన్నారు.” “ఆయనకు కుమార్తెల పెంపకం గురించి ఆందోళన ఉండేది. ఆయన పదిహేనేళ్ల కుమార్తె గురించి ‘ఆమెకు ఫోన్ కొనివ్వాలా వద్దా?’ అని నన్ను (హుజూర్ అన్వర్ ను) అడిగారు, మరియు నా మార్గదర్శకాలు అందిన తరువాత, వాటి ప్రకారం ఆచరించారు. ఆయన ప్రతి విషయాన్ని చాలా సున్నితంగా పరిశీలించేవారు. తప్పనిసరి చందాలతో పాటు ఇతర ఆర్థిక పథకాలలో కూడా చాలా ఉదారంగా, ముందుండి సేవ చేసేవారు. పాకిస్తాన్‌లో కూడా పేదవారి సేవ కోసం పెద్ద మొత్తంలో డబ్బు పంపేవారు.”

“ఆయన తల్లి ఇట్లు వివరించారు: ‘నా కొడుకు జమాఅత్‌కు ప్రాణమిచ్చేవారు, ఖిలాఫత్‌తో అమితమైన ప్రేమను కలిగి ఉండేవారు. ప్రతి విషయంలో సత్యానికి ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రతి చిన్న పెద్ద వారితో ప్రేమతో వ్యవహరించేవారు. ప్రచారం పట్ల ఆయనకు చాలా ఆసక్తి ఉండేది. ప్రతి ఆదివారం ప్రచారం కోసం వెళ్లేవారు. తహజ్జుద్ చదివేవారు, ఇతరులకు సహాయం చేసేవారు. ఆమె ఇట్లన్నారు: సామూహిక నమాజు పట్ల ఆయనకు ఎంత ఆసక్తి ఉండేదంటే, కొన్నిసార్లు పనిలో ఉండి కూడా నాకు ఫోన్ చేసి, ‘మీరు నమాజ్ చదవకపోతే వేచి ఉండండి, నేను వస్తున్నాను, మనం కలిసి నమాజ్ చదువుదాం’ అని చెప్పేవారు’. అల్లాహ్ తఆలా ఆయనపై క్షమాభిక్ష, దయ చూపాలని ప్రార్థిస్తున్నాను. తల్లికి, భార్యకు, పిల్లలకు సహనాన్ని ప్రసాదించుగాక. ఆయన మంచి ఆదర్శం, ఆయన కోరికలపై వారి సంతానం నడుచుకునే విధంగా ఉండుగాక.”

❖❖❖

---

**(1వపేజి తరువాత)** వారు ప్రపంచీకులకు ఇతరుల కంటే ఎంతో అందముగా, ఉన్నతులుగా కనబడుతుంటారు. వారికి భిన్నముగా ఇతరుల ముఖాలు అంత అందముగా కనిపించవు. కావున ఒకవేళ మనం ఈ సూక్తికి బాహ్య అర్థమును తీసుకున్న కూడ ఈ భావం కూడ సరైనదిగానే ఉంటుంది. కాని అంతమాత్రమున వారి రూపురేఖలు కూడ అందముగా ఉంటాయని కాదు. కేవలం సామెతగా చెప్పుకున్నట్లుగా నది ప్రవహిస్తూనే ఉంటుంది. దాని అర్థమేమనగా నదిలో నీళ్ళు పారుతూనే ఉంటాయి. అదే విధముగా ఇక్కడ అర్థమేమనగా, వారు తమ ఉపకారం దృష్ట్యా అందముగా కనిపిస్తుంటారు. వారిలో ఉపకార గుణం ఉన్నప్పుడు, వారు సత్కార్యములు చేస్తున్నప్పుడు, లోపాలను కప్పిపుచ్చు గుణం వారిలో ఉన్నప్పుడు, ఇతరులను ఆదరించుతత్వం ఉన్నప్పుడు వారు ప్రజలకు అత్యంత ప్రియమైన వారవుతారు. కావున **వుజూహుమ్ యౌమ ఇజిన్ నాఇమతున్** లో అనుచరులు లేదా విశ్వాసుల ఉన్నత సుగుణాలను గూర్చి ప్రస్తావించడం జరిగింది. అనగా ఎంతో గొప్ప సుగుణాలను, ఆదరణ స్వభావాలను అల్లాహ్ తాలా వారికి అనుగ్రహించును. ఫలితముగా వారు ప్రపంచీకుల దృష్టిలో ఎంతో సౌందర్య వంతముగా, అందముగా కనిపించెదరు. ఒకవేళ ఇక్కడ నిష్టాపరత మరియు విజ్ఞానంను అర్థం చేసుకున్నచో అవి కూడ స్పష్టముగానే కనిపిస్తున్నాయి. వాటిని విశ్లేషించవలసిన అవసరం లేదు.

**(తఫ్సీరే కబీర్ సంపుటి 12, పేజి 125)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz